# రేవంతన్న.. మీరు సూపర్

## గద్దర్ అవార్డులపై చిత్రపరిశ్రమ ప్రశంసలు

### పద్నాలుగేళ్ల తర్వాత వేడుక సక్సెస్

గతంలో చిత్రపరిశ్రమతో రిస్క్ చేయని ముగ్గురు సీఎంలు

దేనికైనా రెడీ అంటూ.. సంప్రదాయన్ని ప్రారంభించిన సీఎం రేవంత్

పక్కా ప్లానింగ్ తో.. అవార్డుల వేడుక సక్సెస్

తెలంగాణ బాటలో ఏపీ.. దారి చూపిన రేవంత్



"హైదరాబాద్, మహా: రేవంత్ రెడ్డి.. రిస్క్ తో ఫుట్ బాల్ ఆడి అసాధ్యాన్ని సుసాధ్యం చేసే డైనమిక్ లీడర్. రెండు రాష్ట్రాలుగా విడిపోయిన తెలుగు సినిమాలకు అవార్డులు ఎలా ఇస్తారు? అసలు సినిమా అవార్డులకు గద్దర్ అవార్డులు పెట్టడమేంటి? ఇది సాధ్యమవుతుందా? అంటూ ముందు నుండీ సన్నాయినొక్కులు నొక్కిన వారు, విమర్శలు చేసిన వారు, శాపనార్థాలు పెట్టిన వారంతా విస్తుపోయేలా.. ఆశ్చర్యపడేలా తెలంగాణ ప్రభుత్వం గద్దర్ అవార్డులు ప్రకటించి.. వేడుక నిర్వహించి సత్తాచూపింది."

**వేడుక గ్రాండ్ సక్సెస్**

ఆరు నెలలు వర్క్ చేశాం

అవార్డులు వచ్చిన వారంతా వస్తే బాగుండేది

ఎఫ్ డిసి ఛైర్మన్ దిల్ రాజు

గద్దర్ అవార్డులు కార్యక్రమంలో పాల్గొనే విషయంలో సినీ పరిశ్రమ తీరుపై ఎఫ్‌డీసీ ఛైర్మన్, నిర్మాత దిల్‌రాజు అసంతృప్తి వ్యక్తం చేశారు. మీడియాతో ఆయన మాట్లాడుతూ, అవార్డులు వచ్చిన వారు కార్యక్రమానికి హాజరై అవార్డు తీసుకుంటే బాగుండేదన్నారు. గద్దర్ అవార్డుల వేడుకకు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి రెండు గంటల సమయం వెచ్చించారని పేర్కొన్నారు. కనుక సినీ పరిశ్రమకు చెందిన వారు అవార్డుల పంపిణీ కార్యక్రమానికి సమయం కేటాయించాలని కోరారు. ఆర్నెల్లు కష్టపడితే గద్దర్ అవార్డుల కార్యక్రమం విజయవంతమైందని ఆయన చెప్పారు.

### కాస్త సమయం కేటాయించండి!

'తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్ ' ప్రదానోత్సవం శనివారం జరిగిన సంగతి తెలిసిందే. ప్రభుత్వానికి కృతజ్ఞతలు చెప్పేందుకు దిల్ రాజు తాజాగా ప్రెస్‌మీట్ నిర్వహించారు. "నిన్న తెలంగాణ గద్దర్ అవార్డుల వేడుక గ్రాండ్‌గా జరిగింది. ఆ విషయంలో నాకు చాలా ఆనందంగా ఉంది. ఈ అవార్డుల కోసం ఆరు నెలలుగా వర్క్ చేశాం. ఈ పురస్కారాలకు సంబంధించి కొన్ని నియమ, నిబంధనలు ఉన్నాయి. ముందుగా 2024 చిత్రాలకే అవార్డులు ఇవ్వాలనుకున్నాం. కానీ తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన ఏడాది నుంచీ ఇస్తే బాగుంటుందని పలువురు సూచించారు. ఆ మేరకు ఓ కమిటీ ఏర్పాటు చేశారు. 2014 నుంచి 2023 వరకూ ఏడాదికి 3 ఉత్తమ చిత్రాలను ఎంపిక చేయడం చాలా కష్టమైన పని. ఈ వేడుకలో పాల్గొన్న వారందరికీ కృతజ్ఞతలు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి మా ప్రత్యేక ధన్యవాదాలు. వాస్తవానికి సీఎం ఒక గంట మాత్రమే ఈ కార్యక్రమానికి కేటాయించారు. కానీ ప్రోగ్రామ్ నాలుగున్నర గంటలు ఉంది. అందుకే సీఎం రేవంత్ రెడ్డి వేడుకకు వచ్చాక, పరిస్థితి వివరించి, ఇంకా ఎక్కువ సమయం ఉండాలని వ్యక్తిగతంగా విజ్ఞప్తి చేశాను. ఆయన 'ఎంతసేపు ఉండాలి?' అని అడిగారు. పూర్తయ్యే వరకూ ఉంటే చాలా హ్యాపీ సర్ అని చెప్పాను. అలా 2:15 గంటల పాటు సీఎం అక్కడ ఉన్నారు. ముఖ్యమంత్రి చేతుల మీదుగా అవార్డులను అందుకున్న వారంతా చాలా ఆనందంగా ఉన్నారు. ఈ పురస్కారాల వేడుక విషయంలో మాకు మార్గనిర్దేశం చేసిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి గారికి ప్రత్యేక ధన్యవాదాలు" అని అన్నారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పట్టుదల ఎఫ్ డిసి ఛైర్మన్ దిల్ రాజు కార్యదీక్ష, సినీప్రముఖుల సహకారంతో.. గద్దర్ సినీ అవార్డుల వేడుక అనుమానాలన్నీ పటాపంచలు చేసి వావ్ అనిపించింది. పద్నాలుగేళ్ళుగా ఆగిపోయిన సినీ అవార్డులకు కొత్త కళ రాగా, సినీ ప్రముఖులంతా జై తెలంగాణ అంటూ నినదించడం ఆసక్తిని కలిగించింది. అవార్డుల వేడుక గ్రాండ్ సక్సెస్ అంటూ తెలుగు సినీ ప్రముఖులతో పాటు ఇతర సినీరంగాల నుండి కూడా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై ప్రశంసల జల్లు కురిపిస్తున్నారు. పక్కా ప్లానింగ్ తో అవార్డుల వేడుక సక్సెస్ చేయడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

### ముఖ్యమంత్రి ముందుచూపు

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముందుచూపు తెలుగు సినీ అవార్డుల వేడుక విజయవంతం ద్వారా మరోసారి ప్రస్ఫుటమైంది. తెలుగు సినీ పరిశ్రమ పై తన విజన్ ను ఆవిష్కరించడం ద్వారా సీఎం తపన సినీ దిగ్గజాలకు అర్థమైంది. ఎఫ్ డిసి ఛైర్మన్ గా దిల్ రాజును ఒప్పించడమే సీఎం రేవంత్ రెడ్డి సక్సెస్. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో సినీ ప్రముఖులతో వ్యక్తిగత సంబంధాలున్నా.. ప్రభుత్వపరంగా ఎఫ్ డిసి ని బలోపేతం చేయడం కానీ, ప్రభుత్వంతో సినీ పరిశ్రమను అనుసంధానించడం గానీ చేయలేదు. ఎఫ్ డిసి ఛైర్మన్ గా దిల్ రాజు ను నియమించడం ద్వారా ఆ పదవికి గ్లామర్ తీసుకువచ్చి, పరిశ్రమకు రాజకీయాలకు అతీతంగా ప్రభుత్వం వ్యవహరిస్తుందన్న నమ్మకం కలిగించి.. అవార్డుల వేడుకను పట్టాలెక్కించారు. తెలుగు సినిమాకు ప్రభుత్వ అవార్డులు కలే అని అందరూ ఫిక్సయిన తరుణంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పద్నాలుగేళ్ళక్రితం పాతరేసిన సంప్రదాయాన్ని అద్భుతంగా అంగరంగవైభవంగా తిరిగి ప్రారంభించారు. అవార్డుల వేడుక అద్భుతంగా నిర్వహించడంతో అవార్డులు అందుకున్న ప్రతి ఒక్కరిలోనూ సంతోషం వ్యక్తమైంది. లెజెండ్ మణిరత్నం, సుహాసినితో పాటు అలనాటి తారలు జయసుధ, జయప్రద, మురళీమోహన్ తదితరులు ఎంతో ఆస్వాదించారు. రాజమౌళి, సుకుమార్, అల్లు అరవింద్ లాంటి దిగ్గజాలు కళ తీసుకొచ్చారు. మొత్తంగా సినీ వేడుకను సక్సెస్ ఫుల్ గా నిర్వహించి మరోసారి రేవంత్ రెడ్డి అనితరసాధ్యుడు అనిపించుకున్నారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఎఫ్ డిసి ఎండి హరీష్ తదితరులు వేడుకల విజయవంతంతో ముఖ్యమంత్రి ఆదేశాలకు అనుగుణంగా కీలకపాత్ర పోషించారు.

### త్వరలో ఆంధ్రప్రదేశ్ అవార్డులు!

"త్వరలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా అవార్డులు ఇస్తుంది. ప్రభుత్వం నుంచి అవార్డులు వస్తున్నాయంటే, వాటిని చాలా జాగ్రత్తగా స్వీకరించాలి. ఎక్కడున్నా, షూటింగ్‌తో బిజీగా ఉన్నా కూడా తప్పకుండా రావాలి. ప్రభుత్వంతో ప్రయాణించాల్సిన బాధ్యత సినిమా వారందరికీ ఉంది. ఇకపై ప్రభుత్వం తరఫున అవార్డుల వేడుక ప్రకటన వచ్చినప్పుడు, మీ డైరీల్లో నోట్ చేసుకుని, మీకు వచ్చిన అవార్డు తప్పకుండా స్వయంగా వచ్చి స్వీకరించండి. చిత్ర పరిశ్రమలోని ప్రతి ఒక్కరికీ ఇది నా విజ్ఞప్తి. అందరూ అర్థం చేసుకుంటారని అనుకుంటున్నాను" అని దిల్ రాజు పేర్కొన్నారు. వేడుకకు హాజరై, విజయవంతం చేసిన వారందరికీ ఎఫ్‌డీసీ ఎండీ హరీశ్ ధన్యవాదాలు తెలిపారు.

# బీజేపీలోకి చిరంజీవి

## నేను పిలిస్తే కాదనరు

### కిషన్ రెడ్డి సంచలన ప్రకటన

### వ్యూహాత్మకంగా బీజేపీ పావులు

**హైదరాబాద్, మహా**

భారతీయ జనతాపార్టీ మెగాస్టార్ చిరంజీవి విషయంలో అత్యంత వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోంది. ఎపుడూ ఆచితూచి మాట్లాడే.. కేంద్రమంత్రి, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి మెగాస్టార్ చిరంజీవి తాను పిలిస్తే కాదనరని, రాజకీయాల్లోకి వస్తారంటూ చేసిన వ్యాఖ్యలు తెలుగురాష్ట్రాల్లో సంచలనంగా మారాయి. చిరంజీవికి రాజ్యసభ ఇచ్చి, కేంద్రమంత్రిని చేయవచ్చని గత కొంతకాలంగా వినపడుతోంది. ప్రధాని నరేంద్రమోదీ చిరంజీవిని, జనసేనాని పవన్ కల్యాణ్ ను అమితంగా అభిమానిస్తారు. ఈ నేపథ్యంలో కిషన్ వ్యాఖ్యలు.. కొత్త చర్చకు దారితీశారు.

**నా మాట చిరంజీవి కాదనరు**

బీజేపీలోకి ఎవరైనా వస్తారంటే పిలిచేందుకు తాను సిద్ధంగా ఉన్నానని, నా మాట కాదనకుండా పిలవగానే చిరంజీవి వస్తారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తన మనసులో మాట బయటపెట్టారు. ఈ మేరకు ఆయన ఆదివారం మీడియాతో చిట్ చాట్‌లో మాట్లాడారు. అనేక మంది సినీ ప్రముఖులతో బీజేపీకి సంబంధాలు ఉన్నాయని కిషన్ రెడ్డి అన్నారు. విజయశాంతి, కోట శ్రీనివాస రావు, కృష్ణం రాజు, ఎస్ జానకి సుమన్, నరేష్ లాంటి వాళ్ళు పార్టీలో పనిచేశారని చెప్పారు. వారిలో కొందరు పార్టీలో చేరి మంత్రులు కూడా అయ్యారని, కొందరుపార్టీకి ప్రచారం చేశారని గుర్తు చేశారు.

**స్థానిక ఎన్నికల్లో ఒంటరిపోరే**

మాకు ప్రత్యర్థి కాంగ్రెస్‌పార్టీనే అన్న ఆయన ఎవడో పనికి రాని వాడు బీజేపీ, కాంగ్రెస్ ఒకటే అంటే సమాధానం చెప్పాలా? అని ఫైర్ అయ్యారు. కుటుంబ, అవినీతి రాజకీయాలకు వ్యతిరేకంగా బీజేపీ పోరాటం చేస్తుందని కిషన్ రెడ్డి తెలిపారు. ఇక రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ ఒంటరిగానే పోటీ చేస్తుందని స్పష్టం చేశారు. బీజేపీలో తర్వాతి అధ్యక్షుడు ఎవరో బీఆర్ఎస్ వాళ్లు చెప్పగలరా అని ప్రశ్నించిన కిషన్ రెడ్డి బీఆర్ఎస్‌లో తరువాతి అధ్యక్షుడు ఎవరో అందరికీ తెలుసన్నారు. బీఆర్ఎస్‌లో డైనింగ్ టెబుల్ నిర్ణయాలు ఉంటాయని బీజేపీలో అలా కాదన్నారు. బీజేపీ అధ్యక్ష పదవికి పోటీ చేయాలంటే రెండు సార్లు క్రియాశీల సభ్యుడు అయ్యి ఉండాలన్నారు. ఈటల రాజేందర్ ఎమ్మెల్యే, ఎంపీగా గెలిచారని, అందువల్ల ఆయనకు ఈ నిబంధన వర్తించదని స్పష్టం చేశారు. తెలంగాణలో టెక్స్ టైల్ ప్రాజెక్ట్ , జహీరాబాద్ లో ఇండస్ట్రియల్ పార్క్ , పసుపు బోర్డు తెచ్చింది బీజేపీనేనన్న కిషన్ రెడ్డి రైల్వే కోచ్ ఫ్యాక్టరీ వచ్చింది కూడా తమ వల్లనే అన్నారు. కానీ కాంగ్రెస్ మంత్రులు మాత్రం తమ వల్లనే వచ్చిందని చెప్పుకుంటున్నారని, ఇవి కాంగ్రెస్ అధికారంలోకి రాకముందే ప్రకటించామన్నారు.మా వల్లే వచ్చాయని చెప్పుకుంటున్నవారిని ఈడ్చి కొట్టాలని కిషన్‌రెడ్డి తీవ్రంగా మండిపడ్డారు. రాష్ట్ర అభివృద్ధికి బీజేపీ సహకరిస్తుందని, హైదరాబాద్ మెట్రో నెక్స్ట్ ఫేజ్‌కి కేంద్రం సహకారం అందిస్తుందని స్పష్టం చేశారు.





## ఫోన్ ట్యాపింగ్‌పై కేంద్ర సంస్థలు విచారించాలి

- ఇది ప్రజాప్రతినిధుల గౌరవంపై దాడి
- కేసీఆర్ కుటుంబం రాష్ట్ర యంత్రాంగాన్ని వ్యక్తిగత నిఘా సాధనంగా వాడుకుంది
- ఎంపీ ధర్మపురి అరవింద్ ఆసక్తికర ట్వీట్
- కేంద్ర హోంమంత్రికి, లోక్ సభ స్పీకర్ కు లేఖ

**నిజామాబాద్, మహా:**

ఫోన్ ట్యాపింగ్ పై కేంద్రసంస్థలు దర్యాప్తు చేయాల్సిన అవసరముందని, ప్రజాప్రతినిధుల గౌరవంపై కేసీఆర్ కుటుంబం దాడిచేసిందని బీజేపీ ఎంపీ ధర్మపురి అరవింద్ అన్నారు. ఎంపీ అరవింద్ ఫోన్ కూడా ట్యాప్ చేశారని బయటపడడంతో ఆదివారం ఎక్స్ వేదికగా ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై స్పందించారు. ఈ రోజు ఉదయం నిద్రలేచిన వెంటనే నన్ను తీవ్రంగా కలవరపెట్టే కొన్ని భయానక విషయాలు బయటపడ్డాయని తెలిపారు. ఈ అక్రమ ఫోన్ ట్యాపింగ్ ఘటనపై కేంద్ర దర్యాప్తు సంస్థల ద్వారా వెంటనే పూర్తి స్థాయిలో విచారణ జరపాలని డిమాండ్ చేయాల్సిన అవసరం ఉందని కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌ని కోరారు. సీఎం రేవంత్ రెడ్డికి మాజీ సీఎం కేసీఆర్ కుటుంబంతో సంబంధం ఉన్నందున.. తెలంగాణ ప్రభుత్వం నేరస్థులపై చర్యలు తీసుకునే అవకాశం చాలా తక్కువ ఉండొచ్చని ఆరోపించారు. ఒక లోక్‌సభ సభ్యుడిగా నాకు ప్రజలు బాధ్యతనిచ్చారని, కానీ నా ఫోన్ కాల్స్, బెడ్‌రూమ్స్, బాత్రూంలను అక్రమంగా నిఘాలో పెట్టడానికి కాదన్నారు. ఇది కేవలం రాజకీయ కక్ష కాదని, ఇది నేరపూరిత వేధింపులు అని పేర్కొన్నారు. 2019 నుండి నన్ను శారీరకంగా దాడి చేసి, నిరంతరం వేధిస్తున్నారని ఆరోపించారు. ఈ మొత్తం కుట్రకు మాజీ కేసీఆర్ కుటుంబమే మూలం, వారు రాష్ట్ర యంత్రాంగాన్ని వ్యక్తిగత నిఘా సాధనంగా ఉపయోగించారని తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ ట్యాపింగ్ కేసుపై లోక్‌సభ స్పీకర్, కేంద్ర హోమ్ మంత్రికి లేఖ రాయనున్నట్లు తెలిపారు. ఇది నా పై చేసిన దాడి మాత్రమే కాదు.. ఇది ప్రజాస్వామ్యం, ప్రజాప్రతినిధుల గౌరవంపై దాడి అని పేర్కొన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసుపై కేంద్ర దర్యాప్తు సంస్థలతో విచారించాలని, దీనికి కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కేంద్ర హోం మంత్రికి లేఖ రాయనున్నట్లు ట్వీట్ చేశారు.

# నెలాఖరులో స్థానిక ఎన్నికల షెడ్యూల్

## ముందుగా ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు

### కార్యకర్తలతో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

### వారంలో రైతు భరోసా, సన్నాలకు బోనస్ ఇస్తాం

### నేటి కేబినెట్ భేటీలో స్పష్టత రానుందని మంత్రి వెల్లడి

**కూసుమంచి, మహా:**

స్థానిక సంస్థల ఎన్నికలపై రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కీలక ప్రకటన చేశారు. ఈ నెలాఖరులోగా స్థానిక సంస్థలకు ఎన్నికల షెడ్యూల్ ఉంటుందని చెప్పారు. కూసుమంచిలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో పార్టీ ముఖ్య నేతలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన... తొలుత ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు ఉంటాయన్నారు. స్థానిక ఎన్నికలపై నేటి కేబినెట్ సమావేశంలో చర్చించాక ఎన్నికల తేదీ పై స్పష్టత ఇస్తామని మంత్రి పొంగులేటి చెప్పారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు పూర్తయిన తర్వాత... వెంటనే సర్పంచ్, మున్సిపల్ ఎన్నికలు ఉంచాయన్నారు. లోకల్ బాడీ ఎన్నికలు రాబోతున్న నేపథ్యంలో... గ్రామాల్లో నాయకుల మధ్య సఖ్యత ఉండాలని సూచించారు.

**ఎన్ని ఎకరాలుంటే అన్ని ఎకరాల వరకు..**

గ్రామాల్లో నాయకుల మధ్య సఖ్యత ఉండాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు. నాయకులు నేతలు ఎవరైనా ప్రజా సమస్యల పరిష్కారానికి మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. ఎన్నికలు రావడానికి మరో 15రోజుల గడువు మాత్రమే ఉందని అన్నారు. కాబట్టి ఆయా గ్రామాల్లో చిన్న చిన్న లోటుపాట్లు ఉంటే వాటిని సరిదిద్దుకుని ఎన్నికలకు సిద్ధం అవ్వాలని సూచించారు. రిజర్వేషన్ల ఆధారంగా ఎన్నికల్లో గెలిచే అవకాశాలు ఎక్కువ ఉన్న అభ్యర్థులను మాత్రమే ఎంపిక చేస్తామని స్పష్టం చేశారు. రాబోయే వారం రోజుల్లోనే అర్హులైన రైతు సోదరులందరికీ కుంట నుంచి ఎన్ని ఎకరాలుంటే అన్ని ఎకరాల వరకు రైతు భరోసా ఇస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. సన్నాలకు రైతు బోనస్ వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామని అన్నారు. సంక్షేమ పథకాల ఆవశ్యకతను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత స్థానిక నాయకులదేనని చెప్పారు. మీ గ్రామాల్లో లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయించుకోవడమే కాదని.. వాటి నిర్మాణం పూర్తి చేయించే బాధ్యత కూడా నాయకులే తీసుకోవాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కోరారు.



## నాగలి పట్టిన మంత్రి శీనన్న!

- దుక్కి దున్ని రైతులతో విత్తనాలు నాటిన మంత్రి
- నేటి నుంచి రైతు భరోసా విడుదల చేస్తామని స్పష్టం

**మహా:** వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో కూసుమంచిలో జరిగిన ఏరువాక కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. ఆయన స్వయంగా అరక పట్టి చేల్లో అచ్చు తోలిన అనంతరం మహిళా కూలీలతో కలిసి పత్తి గింజలను నాటారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. 'ఇందిరమ్మ రాజ్యంలో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తూ రైతును రాజు చేయాలనేదే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుంది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేకపోయినా ప్రభుత్వం రైతులను ప్రోత్సాహిస్తోంది. ఆనాటి ప్రభుత్వం 10 సంవత్సరాల్లో రైతులకు రూ.17000 కోట్ల రూపాయలు రుణమాఫీ చేస్తే,మన ప్రభుత్వం 18 నెలల్లో నే రూ 21000 కోట్ల రూపాయలు రుణమాఫీ చేసింది. రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేసేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోంది. నాణ్యమైన విత్తనాలు,ఎరువులు ఇబ్బంది లేకుండా పంపిణీ చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసింది. గత ప్రభుత్వం వారి స్వార్థం కోసం ప్రాజెక్టులు మొదలు పెట్టి అర్థాంతరంగా వదిలేస్తే వాటిని పూర్తి చేస్తూ సాగు నీటిని అందిస్తాం. వ్యవసాయానికి యోగ్యమైన ప్రతి ఎకరానికి పెట్టుబడి కోసం 12 వేలు ఇస్తాం. రైతు భరోసా ఇప్పటికే రెండు సార్లు ఇచ్చాం, నేటి నుంచి రైతు భరోసా నిధులు విడుదల చేస్తాం.. కాళేశ్వరం కూలినా కూడా దేశంలో అత్యధిక ధాన్యం పండించిన రాష్ట్రంగా మనం మొదటి స్థానంలో ఉన్నాం. ప్రతి నీటి బొట్టును ఒడిసి పట్టుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు తయారు చేస్తోంది' అని తెలిపారు.



(మొదటిపేజీ తరువాయి)

## నేడు కేటీఆర్‌ను విచారించనున్న ఏసీబీ

# అరెస్ట్‌పై ప్రచారం

కేటీఆర్ ను కూడా విచారణ చేసింది. అయితే కేటీఆర్ నేడు ఫార్ములా ఈరేస్ కారు కేసుకు విచారణకు హాజరుకానున్నారు. నేడు ఉదయం పది గంటలకు విచారణకు హాజరు కావాలని ఇటీవల ఏసీబీ అధికారులు జారీ చేసిన నోటీసుల్లో పేర్కొన్నారు. ఫార్ములా ఈ రేసు కేసులో రెండోసారి నోటీసులు జారీ చేశారు. దీంతో నేడు ఏం జరగబోతుందన్నది చర్చనీయాంశంగా మారింది. ఇప్పటికే ఒకసారి విచారించిన కేటీఆర్ ను మరోసారి విచారణకు పిలవడంతో బీఆర్ఎస్ నేతల్లో ఉత్కంఠ నెలకొంది. మే 26వ తేదీన విచారణకు రావాలని నోటీసుల్లో కోరగా, అప్పటికే ముందుగా ఫిక్స్ అవ్వడంతో తాను విదేశీ పర్యటన నుంచి వచ్చిన తర్వాత హాజరవుతానని చెప్పారు. ఈ మేరకు నోటీసులు తాజాగా జారీ చేశారు. కాగా కేటీఆర్ అరెస్ట్ జరగొచ్చన్న ప్రచారం నేపథ్యంలో కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావాలని నేతలు పిలుపునిస్తున్నారు. ఈ మేరకు తమ వాట్సాప్ గ్రూపుల్లో షేర్ లు చేస్తున్నారు.

**ప్రభాకర్‌రావు సంచలన విషయాలు..**

మరోవైపు ఫోన్ ట్యాపింగ్ కేసులో ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్ రావు విచారణతో సంచలన విషయాలు వెలుగు చూస్తున్నాయి. రాజకీయ నిఘా కోసమే ఎస్వోటీ విభాగాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన విచారణలో అంగీకరించారు. అప్పటి డీఎస్పీ ప్రణీత్ రావును ఈ అక్రమ కార్యకలాపాల కోసమే నియమించామన్నారు. బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా ఉన్న ప్రముఖుల ఫోన్‌లను 'మావోయిస్టు' ముసుగులో ట్యాప్ చేసినట్లు ఆయన విచారణలో ఒప్పుకున్నట్లు తెలిసింది. ఫోన్ ట్యాపింగ్ కీలక నిందితుడు.. ప్రభాకర్ రావు అమెరికా నుంచి తిరిగిరావడంతో కేసు కొలక్కి వస్తుందని భావించారు. కానీ.. ప్రభాకర్ రావు కథ మొదటికి తెచ్చారు. ఇప్పటికే ఈ కేసులో ఉన్న నిందితులంతా ప్రభాకర్ రావు పేరు చెప్పారు. తన డైరెక్షన్‌లోనే ట్యాపింగ్‌కి పాల్పడ్డామని ఆధారాలు కూడా పోలీసులకు సమర్పించారు. కానీ.. ప్రభాకర్ రావు మాత్రం తనకేం తెలీదని.. శాఖాపరమైన ఆదేశాలు మాత్రమే ఇచ్చానని చెప్తున్నాడు. అదీకాకుండా... ఉల్టా సిట్ అధికారులనే ప్రశ్నిస్తున్నాడు. నాపై ఉన్నతాధికారులను కూడా ఈ కేసులో ఎందుకు చేర్చలేదని సిట్ అధికారులనే ప్రశ్నిస్తున్నాడు. రెండోసారి విచారణకు ప్రభాకర్ రావును పిలిచిన సిట్ అధికారులు... తన మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్, మ్యాక్ బుక్ లను తీసుకురావాలని సూచించారు సిట్ అధికారులు. దీంతో తాను వాడిన రెండు మొబైల్ ఫోన్లను సిట్‌కు అందజేశారు ప్రభాకర్ రావు. ఆ మొబైల్స్ నుంచి ఏవైనా ఆధారాలు సేకరిస్తే.. వాటిని కూడా ముందుంచి ప్రభాకర్ రావును విచారించనుంది.

# బనకచర్లపై పోరులో ప్రభుత్వానికి మద్దతిస్తాం

## మంత్రి ఉత్తమ్‌కు హరీశ్ రావు లేఖ.. బనకచర్ల ప్రాజెక్టుతో తెలంగాణకు తీవ్ర నష్టం

### అఖిల పక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయాలన్న హరీశ్

**తెలంగాణ, మహా:**

తెలంగాణ భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు ఆదివారం లేఖ రాశారు. గోదావరి నదిపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం బనకచర్ల ప్రాజెక్ట్ నిర్మించేందుకు ప్రణాళికలు రూపొందిస్తోంది. గోదావరి బనకచర్ల లింక్ ప్రాజెక్ట్ కారణంగా గోదావరి జలాల్లో తెలంగాణ హక్కులకు భంగం వాటిల్లే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిపాదించిన 200 టీఎంసీల గోదావరి నీటిని బనకచర్ల వరకు తరలించేందుకు మూడు దశల్లో ప్రాజెక్ట్ డిజైన్, కేంద్రానికి పీఎఫ్ఆర్ సమర్పించడం.. తెలంగాణ నీటి హక్కులను కాలరాయడమేనని ఈ సందర్భంగా మాజీ మంత్రి హరీశ్ రావు ఆ లేఖలో స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్ట్‌ను కేంద్రం ఆమోదించే లోపే.. తెలంగాణ ప్రాజెక్టులకు అనుమతులు రావాల్సి ఉండగా.. ఏపీ ఏకపక్షంగా ముందుకు వెళ్లుతుండడం అన్యాయమన్నారు. అయితే రెండు రోజుల క్రితం ఇదే అంశంపై కేంద్ర జలశక్తి మంత్రికి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి లేఖ రాయడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్ట్‌ను ఆ లేఖలో వ్యతిరేకించడం పట్ల మంత్రి ఉత్తమ్‌ను హరీశ్ రావు పొగడ్తలతో ముంచెత్తారు. ఏపీ తీసుకుంటున్న చర్యలు.. 2014 రాష్ట్ర పునర్విభజన చట్టంతోపాటు నది జలాల బోర్డుల నియమాలను ఉల్లంఘిస్తుందని.. దీనిపై వెంటనే ఎపెక్స్ కౌన్సిల్ సమావేశం ఏర్పాటు



చేసేందుకు కేంద్రాన్ని కోరాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి హరీశ్ రావు విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని తగు చర్యలు తీసుకోవాలని.. అలాగే రాష్ట్ర నీటి హక్కుల కోసం బీఆర్ఎస్ పార్టీ మీకు తోడుగా నిలుస్తుందని ఆ లేఖలో హరీశ్ రావు స్పష్టం చేశారు.

**జల్ శక్తి మంత్రిని కోరాలని విజ్ఞప్తి..**

'త్వరలోనే ప్రాజెక్టుకు టెండర్లు పిలువనున్నట్లు తెలుస్తున్నది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విభజన చట్టం 2014ను ఉల్లంఘిస్తున్న కారణంగా ఈ అంశాన్ని చర్చించడానికి తక్షణమే అపెక్స్ కౌన్సిల్ సమావేశాన్ని ఏర్పాటు చేయమని కేంద్ర జల్ శక్తి మంత్రిని కోరాలని విజ్ఞప్తి చేస్తున్నాను. ఇది రాష్ట్ర ప్రయోజనాలకు సంబంధించిన అంశం కాబట్టి బేషజాలకు పోకుండా, రాజకీయాలకు తావు లేకుండా వీలైనంత త్వరలో అఖిల పక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసి, లేదా ప్రత్యేక శాసన సభా సమావేశాన్ని ఏర్పాటు చేసి అందరి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొని ఈ అంశంపై ఒక విధానపరమైన నిర్ణయాన్ని తీసుకోవాలని కూడా కోరుతున్నాను. గోదావరి ట్రిబ్యునల్ అవార్డు ఆధారంగా గోదావరి జలాల్లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి 1480 టీఎంసీల నీరు లభ్యం అవుతుందని ఉమ్మడి రాష్ట్రంలో సాగునీటి శాఖ ఇంజనీర్లు లెక్క గట్టినారు. అందులో తెలంగాణ ప్రాజెక్టులకు 969 టీఎంసీలు ఉమ్మడి రాష్ట్రంలోనే వివిధ జీవోల ద్వారా తెలంగాణ ప్రాజెక్టులకు కేటాయించబడినాయి. ప్రాజెక్టులకు నీటి కేటాయింపులైతే ఉన్నాయి కానీ ఉమ్మడి రాష్ట్రంలో ప్రాజెక్టులు నిర్మాణం కాకపోవడం వలన, కొన్ని ప్రాజెక్టులు పాక్షికంగా నిర్మాణమైనందున వాస్తవ వినియోగం 200 టీఎంసీలకు మించలేదన్నది వాస్తవం. తెలంగాణ రాష్ట్ర సాధనా ఉద్యమానికి సాగునీటి ఆకాంక్షలే ప్రధాన చోదక శక్తిగా ఉన్నాయని మీకు తెలియనిది కాదు. 2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కేసీఆర్ నాయకత్వంలో గోదావరి జలాలను సంపూర్ణంగా వినియోగించుకునే లక్ష్యంతో గోదావరి బేసిన్‌లో తెలంగాణ ప్రభుత్వం అనేక భారీ ప్రాజెక్టులను చేపట్టింది' అని హరీశ్ రావు లేఖలో చెప్పారు.

# విద్యార్థుల భవిష్యతే రాష్ట్ర భవిష్యత్తు

- మెరుగైన విద్య కోసం ఎన్ని నిధులైనా ఖర్చు చేస్తాం
- విక్టోరియా మెమోరియల్ స్కూల్‌కు 5 కోట్లు నిధులు మంజూరు
- విక్టోరియా మెమోరియల్ హోమ్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



**మహా:** విద్యార్థుల భవిష్యతే రాష్ట్ర భవిష్యత్తుగా ప్రజా ప్రభుత్వం భావిస్తుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ఆదివారం ఆయన తన పుట్టినరోజు సందర్భంగా కొత్తపేటలోని విక్టోరియా మెమోరియల్ ఆర్ఫాన్స్ హోమ్ లో విద్యార్థులు, అధికారులు, స్థానిక నేతలను ఉద్దేశించి ప్రసంగించారు. విద్య ద్వారానే మానవ వనరులు మెరుగుపడి తెలంగాణ రాష్ట్రం ప్రపంచంతో పోటీ పడుతుందని అన్నారు. ఇంతటి ప్రాధాన్యత ఉన్న విద్యారంగానికి ఎన్ని నిధులైన ఖర్చు చేసేందుకు సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని యావత్ క్యాబినెట్ సిద్ధంగా ఉందన్నారు. రాష్ట్రంలోని ప్రతి బిడ్డ ప్రపంచంతో పోటీపడేలా ఇంటర్నేషనల్ స్టాండర్డ్స్‌తో విద్యను అందించాలనే గొప్ప సంకల్పంతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ను నిర్మిస్తున్నామని తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో 25 ఎకరాల్లో 200 కోట్ల పెట్టుబడితో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ ఇంటర్నేషనల్ స్కూల్స్ నిర్మిస్తున్నాం అన్నారు. రాష్ట్రంలో మొదటి దశలో 11,600 కోట్లతో 100 పాఠశాలలు నిర్మిస్తున్నాం అన్నారు. విలువైన విక్టోరియా మెమోరియల్ రెసిడెన్షియల్ స్కూల్ స్థలాన్ని అన్యాక్రాంతం కాకుండా కాపాడుతామన్నారు. విక్టోరియా మెమోరియల్ స్థలం చుట్టూ ప్రహరీ గోడ నిర్మించేందుకు వెంటనే ఐదు కోట్లు మంజూరు చేస్తున్నట్టు తెలిపారు. ట్రాన్స్కో శాఖలోని సీఎస్ఆర్ ఫండ్స్ నుంచి ఈ కేటాయింపులు చేస్తున్నట్టు తెలిపారు. నిధులు వెంటనే విడుదల చేస్తాం ప్రహరీ గోడ నిర్మాణ పనులు ప్రారంభించాలని డిప్యూటీ సీఎం సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం ఆయన విక్టోరియా మెమోరియల్లో చదువుకుంటున్న అనాథ విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, మాజీ ఎంపీ మధు యాష్కీ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ప్రారంభించండి

- సీఎం రేవంత్ రెడ్డికి కేంద్ర మంత్రి జయంత్ చౌదరి సూచన

**హైదరాబాద్, మహా** : రాష్ట్రంలో వీఎఫ్ఎక్స్, గేమింగ్, ఆడియో విజువల్స్ రంగాలకు సంబంధించి సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కేంద్ర నైపుణ్యాభివృద్ధి శాఖ మంత్రి జయంత్ చౌదరి సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ఆయన నివాసంలో కేంద్ర మంత్రి జయంత్ చౌదరి ఆదివారం సమావేశమయ్యారు. ఐటీఐ విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధికి ఈ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఉపయోగపడుతుందని కేంద్ర మంత్రి పేర్కొన్నారు. తాము ప్రారంభించిన యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ఏర్పాటు చేసి.. దానిని ఐటీఐలను అనుసంధానిస్తామని ముఖ్యమంత్రి కేంద్ర మంత్రికి తెలియజేశారు. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేయడంపై ముఖ్యమంత్రిని కేంద్ర మంత్రి అభినందించారు. జాతీయ నైపుణ్య శిక్షణ కింద యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీకి మద్దతు ఇవ్వాలని కేంద్ర మంత్రికి సీఎం విజ్ఞప్తి చేశారు. ఐటీఐలన్నింటికి ఉచితంగా విద్యుత్ సరఫరా చేయాలని కేంద్ర మంత్రి సీఎంను కోరారు. ఐటీఐల్లో సోలార్ విద్యుత్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని సీఎం వెంటనే అధికారులను ఆదేశించారు. ఆధునిక పరిశ్రమ అవసరాలకు తగినట్లు కాలానుగుణంగా ఐటీఐల్లో సిలబస్‌ను అప్‌గ్రేడ్ చేయాలని.. ఇందుకోసం ప్రత్యేక కమిటీ నియమించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సమావేశంలో ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, సీఎంవో పరిశ్రమలు, పెట్టుబడుల విభాగం సీఈవో జయేశ్ రంజన్, పరిశ్రమల శాఖ ప్రత్యేక కార్యదర్శి విష్ణువర్ధన్ రెడ్డి, కేంద్ర నైపుణ్యాభివృద్ధి శాఖ అధికారులు పాల్గొన్నారు.

# బాసరలో విషాదం

## గోదావరిలో మునిగి నలుగురు మృతి.. మంత్రి పొన్నం ప్రభాకర్ దిగ్భ్రాంతి

### నీటి లోతుపై అవగాహన లేకపోవడమే ప్రమాదానికి కారణం



**నిర్మల్, మహా:**

నిర్మల్ జిల్లాలో ఆదివారం తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ప్రఖ్యాత పుణ్యక్షేత్రమైన బాసరలో గోదావరి నదిలో పుణ్యస్నానానికి వెళ్లిన ఐదుగురు యువకులు నీట మునిగి ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనతో బాసరలో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతులంతా హైదరాబాద్‌లోని చింతల్ ప్రాంతానికి చెందిన ఒకే కుటుంబ సభ్యులు కావడం గమనార్హం. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, రాజస్థాన్‌కు చెందిన ఒక కుటుంబం హైదరాబాద్‌లో స్థిరపడింది. ఈ కుటుంబంలోని మొత్తం 18 మంది సభ్యులు ఆదివారం బాసరలోని సరస్వతీ అమ్మవారి దర్శనం కోసం, అలాగే గోదావరి నదిలో పుణ్యస్నానం ఆచరించేందుకు వచ్చారు. ఆలయ దర్శనానికి ముందు, సంప్రదాయం ప్రకారం నదిలో స్నానం చేసేందుకు వెళ్లారు. ఈ క్రమంలో ఐదుగురు యువకులు నదిలోకి దిగి, నీటి ప్రవాహంలో లోపలికి వెళ్లారు. నీటి లోతుపై సరైన అంచనా లేకపోవడంతో వారు ఒక్కసారిగా మునిగిపోవడం ప్రారంభించారు.

**వీరంతా 20 ఏళ్ల లోపు వయస్సు వారే..**

నది ఒడ్డున ఉన్న కుటుంబ సభ్యులు ఇది గమనించి కేకలు వేశారు. స్థానికులు వెంటనే స్పందించి వారిని కాపాడేందుకు ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకపోయింది. సమాచారం అందుకున్న పోలీసులు, నిపుణులైన ఈతగాళ్ల సహాయంతో నదిలో గాలింపు చర్యలు చేపట్టి ఐదుగురి మృతదేహాలను వెలికితీశారు. ఇటీవల ఎగువ ప్రాంతల్లో కురిసిన వర్షాల కారణంగా గోదావరి నదిలో నీటి ప్రవాహం పెరిగిందని అధికారులు తెలిపారు. మృతులను రాకేశ్, వినోద్, మదన్, రుతిక్, భరత్‌లుగా గుర్తించారు. వీరంతా 20 ఏళ్ల లోపు వయస్సు వారే కావడం మరింత ఆవేదనకు గురిచేస్తోంది. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం భైంసా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

# నేడు కేబినెట్ సమావేశం!

## సీఎం రేవంత్ అధ్యక్షతన మధ్యాహ్నం భేటీ

### స్థానిక సంస్థల ఎన్నికలపై నిర్ణయం తీసుకునే చాన్స్

### మంత్రులు హింట్ ఇవ్వడంతో ఎన్నికలపై ఆశావహుల్లో కొత్త టెన్షన్

### రైతు భరోసాతో పాటు పథకాలపై కూడా మంత్రివర్గం డిస్కషన్స్

**హైదరాబాద్, మహా:** నేడు తెలంగాణ కేబినెట్ మధ్యాహ్నం రెండు గంటలకు సమావేశం కానుంది. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేందుకు సిద్ధమవుతున్న తెలంగాణ ప్రభుత్వం మంత్రివర్గ సమావేశం నిర్వహించనుంది. ఈ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకునేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. ముఖ్యంగా స్థానిక సంస్థల ఎన్నికలపై కీలక నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఈ విషయమై ఇప్పటికే కొంత స్పష్టత ఇచ్చారు. ఈ నెలాఖరున నోటీఫికేషన్ ఇచ్చి జూలైలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందనిఆయన తెలిపారు. గత సమావేశంలో ప్రతి పదిహేను రోజులకు ఒకసారి కేబినెట్ సమావేశం నిర్వహించాలని తీసుకున్న నిర్ణయానికి అనుకూలంగా ఇవాళ నిర్వహించనున్నారు.

**రైతుభరోసాతో పాటు..**

ఈ నెలలో నోటిఫికేషన్ ఇచ్చి వచ్చే నెలలో ఎన్నికలకు వెళ్లాలని ప్రభుత్వం భావిస్తోంది. గత సమావేశంలో పంచాయతీ ఎన్నికల నిర్వహణపై క్యాబినెట్ సమాలోచనలు చేసింది. వర్షాకాలం నేపథ్యంలో జూన్ జులైలో పంచాయతీ ఎన్నికల నిర్వహణ ఏ మేరకు సురక్షితం అన్నదానిపై కేబినెట్ చర్చించనున్నది. అలాగే వర్షాకాల రైతు భరోసాపై ఒక నిర్ణయం తీసుకోనుంది. వీలయినంత త్వరగా ఎన్నికల లోపు రైతులందరికీ రైతు భరోసా చెల్లించాలని ప్రభుత్వం భావిస్తోంది. తద్వారా ఎన్నికలు ఏక్షపక్షంగా జరిగే అవకాశం ఉంటుందని ప్రభుత్వం భావిస్తోంది. మరోవైపు రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇండ్లపై కూడా ప్రభుత్వం నిర్ణయం తీసుకోనుంది. ఈ సమావేశంలో తాజా రాజకీయ పరిస్థితులపై కూడా మంత్రివర్గం చర్చించే అవకాశం ఉంది. అయితే నేడు జరగబోయే సమావేశానికి ఇటీవల కొత్తగా ప్రమాణస్వీకారం చేసిన ముగ్గురు నేతలు కూడా రానున్నారు.

# ఇరాన్‌కు ట్రంప్ వార్నింగ్

**అమెరికాపై దాడి చేస్తే రివేంజ్ గట్టిగా ఉంటుంది**

**మహా:** తమపై దాడులు చేస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇరాన్‌కు మరోసారి గట్టి హెచ్చరిక చేశారు. టెహ్రాన్‌పై శనివారం రాత్రి జరిగిన దాడులతో తమకు సంబంధం లేదని చెప్పారు. ఇరాన్‌కు చెందిన అణ్వాయుధకేంద్రాలు, రక్షణశాఖ ప్రధాన కార్యాలయంపై పెద్దఎత్తున దాడులు చేసినట్లు ఇజ్రాయెల్ ప్రకటించిన గంటల వ్యవధిలో ట్రంప్ ఈ మేరకు స్పందించారు. ఇరాన్ దాడులు చేస్తే మునుపెన్నడూ చూడని విధంగా అమెరికా సైన్యం పూర్తి స్థాయిలో ప్రతీకార దాడులు చేస్తుందన్నారు. ఇజ్రాయెల్ఇరాన్ మధ్య నెలకొన్న సంక్షోభ పరిష్కారానికి మధ్యవర్తిత్వం చేసేందుకు సిద్ధమని ట్రంప్ తెలిపారు. చాలా సులభంగా రాజీ కుదుర్చగలనని ఆయన పేర్కొన్నారు. ఇక ఇప్పటికే ఈ దాడుల్లో ఇరాన్ పూర్తిగా నాశనం అవ్వకముందే తమతో అణు ఒప్పందం చేసుకోవాలని ట్రంప్ టెహ్రాన్‌ను హెచ్చరించారు. ఈ మారణ హోమం ఇలాగే కొనసాగితే ఇరాన్‌లో ఏమీ మిగలదని పేర్కొన్నారు.

# రిజర్వేషన్లు ఇవ్వకుండానే ఎన్నికలా?

- కాంగ్రెస్‌వి బూటకపు మాటలు
- బీసీ సబ్ ప్లాన్‌కు చట్టబద్ధత ఏదీ ?
- అరవై శాతం ఉన్న బీసీలకు మూడేనా మంత్రి పదవులు
- మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ కీలక వ్యాఖ్యలు

**మహా:** బీసీల విషయంలో కాంగ్రెస్ నయవంచన చేసిందని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ విమర్శించారు. కాంగ్రెస్ నాయకుల మాటలు బూటకమని అన్నారు. ఇదే విషయాన్ని తాము మొదట్నుంచి చెబుతున్నామని తెలిపారు. కామారెడ్డి డిక్లరేషన్ ఇక చెత్తబుట్టలో పారేయాల్సిందేనని వ్యాఖ్యానించారు.హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో శ్రీనివాస్ గౌడ్ మీడియాతో మాట్లాడుతూ.. కుల గణన ఏదో గొప్పగా చేశామని ఇది దేశానికి రోల్ మోడల్ అని కాంగ్రెస్ నాయకులు చెబుతున్నారని తెలిపారు. కాంగ్రెస్ వాళ్ళు ఎన్నికల్లో చెప్పిందేమిటి ?చేసిందేమిటి అని ఆయన ప్రశ్నించారు. కులగణన తప్పుల తడకగా చేశారని .. అరవై శాతం జనాభా ఉన్న బీసీలకు మూడేనా మంత్రి పదవులు అని నిలదీశారు. బీసీ లకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని చెప్పి మంత్రివర్గ కూర్పులో ఎందుకు పాటించలేదని ప్రశ్నించారు.

## చట్టబద్ధత ఏదీ ?..

బీసీ సబ్ ప్లాన్‌కు చట్టబద్ధత ఏదీ ? కీలక శాఖలు బీసీల దగ్గర ఎందుకు లేవు? ఏడాదికి రూ.20వేల కోట్లు బీసీలకు బడ్జెట్ లో పెడతామని చెప్పి ఎందుకు పెట్టలేదని ప్రశ్నించారు. ఏ మొహం పెట్టుకుని స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ ఓట్లు అడుగుతుందని మండిపడ్డారు. పార్టీ పరంగా రిజర్వేషన్లు ఇవ్వడం ఏమిటి ? 42 శాతం సీట్లు బీసీలు ఎలాగైనా గెలుస్తారు.. మీరు ఇచ్చేది ఏమిటి అని నిలదీశారు. కామారెడ్డి డిక్లరేషన్‌లో కాంగ్రెస్ పార్టీ బీసీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు పెట్టాలని శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డి పాలనలో కులవృత్తుల బతుకులు ఆగమయ్యాయని అన్నారు. బీసీలు అప్రమత్తంగా లేకపోతే కాంగ్రెస్ ఆగడాలకు అంతే ఉండదని పేర్కొన్నారు. దీనిపై బీసీ సంఘాలు కూడా స్పందించాలని కోరారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ల కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలన్నారు . కామారెడ్డి డిక్లరేషన్ అమలు చేస్తే బీసీలు కాంగ్రెస్‌కు రెడ్ కార్పెట్ పరుస్తారని చెప్పారు.

# ఓవైపు సిట్.. మరోవైపు ఏసీబీ


## ఫోన్ ట్యాపింగ్, ఈ కార్ కేసులో ఏజెన్సీల దూకుడు

### పీక్స్‌కు చేరిన రెండు కేసుల విచారణలు

### నేడు మరోసారి ఇన్వెస్టిగేషన్‌కు మాజీ మంత్రి కేటీఆర్

### సిట్ విచారణలో ప్రభాకర్‌రావు సంచలన విషయాలు

### విచారణ వేళ బీఆర్ఎస్ నేతల్లో టెన్షన్.. టెన్షన్!



**హైదరాబాద్, మహా:** రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రధానంగా రెండు కేసుల విషయంలో ప్రత్యేకంగా దృష్టిపెట్టింది. ఆ రెండు కేసులు ఏమిటంటే ఒకటి టెలిఫోన్ ట్యాపింగ్ కేసు. రెండోది ఫార్ములా ఈ కార్ రేసులో అవినీతి. పై రెండు కేసుల్లోను ప్రభుత్వం గట్టిగా దృష్టిపెడితే బాధ్యులెవరు ? నిందితులు ఎవరన్న విషయంపై ఫోకస్ పెట్టింది. గత ఏడాది డిసెంబరు 19వ తేదీన ఫార్ములా ఈ కారు రేసులో ఏసీబీ కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించింది. ఈ కేసులో కీలకమైన ఐఏఎస్ అధికారి అరవిందకుమార్ తో పాటు హెచ్ఎండీఏ మాజీ చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్ రెడ్డిలను కూడా విచారించింది. కేటీఆర్ ను కూడా విచారణ చేసింది. అయితే కేటీఆర్ నేడు ఫార్ములా ఈరేస్ కారు కేసుకు విచారణకు హాజరుకానున్నారు. నేడు ఉదయం పది గంటలకు విచారణకు హాజరు కావాలని ఇటీవల ఏసీబీ అధికారులు జారీ చేసిన నోటీసుల్లో పేర్కొన్నారు. ఫార్ములా ఈ రేసు కేసులో రెండోసారి నోటీసులు జారీ చేశారు. దీంతో నేడు ఏం జరగబోతుందన్నది చర్చనీయాంశంగా మారింది. ఇప్పటికే ఒకసారి విచారించిన కేటీఆర్ ను మరోసారి విచారణకు పిలవడంతో బీఆర్ఎస్ నేతల్లో ఉత్కంఠ నెలకొంది. మే 26వ తేదీన విచారణకు రావాలని నోటీసుల్లో కోరగా, అప్పటికేముందుగా ఫిక్స్ అవ్వడంతో తాను విదేశీ పర్యటన నుంచి వచ్చిన తర్వాత హాజరవుతానని చెప్పారు. ఈ మేరకు నోటీసులు తాజాగా జారీ చేశారు.

**ప్రభాకర్‌రావు సంచలన విషయాలు..**

మరోవైపు ఫోన్ ట్యాపింగ్ కేసులో ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్ రావు విచారణతో సంచలన విషయాలు వెలుగు చూస్తున్నాయి. రాజకీయ నిఘా కోసమే ఎస్వోటీ విభాగాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన విచారణలో అంగీకరించారు. అప్పటి డీఎస్పీ ప్రణీత్ రావును ఈ అక్రమ కార్యకలాపాల కోసమే నియమించామన్నారు. బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా ఉన్న ప్రముఖుల ఫోన్‌లను 'మావోయిస్టు' ముసుగులో ట్యాప్ చేసినట్లు ఆయన విచారణలో ఒప్పుకున్నట్లు తెలిసింది. ఫోన్ ట్యాపింగ్ కీలక నిందితుడు.. ప్రభాకర్ రావు అమెరికా నుంచి తిరిగిరావడంతో కేసు కొలిక్కి వస్తుందని భావించారు. కానీ.. ప్రభాకర్ రావు కథ మొదటికి తెచ్చారు. ఇప్పటికే ఈ కేసులో ఉన్న నిందితులంతా ప్రభాకర్ రావు పేరు చెప్పారు. తన డైరెక్షన్‌లోనే ట్యాపింగ్‌కి పాల్పడ్డామని ఆధారాలు కూడా పోలీసులకు సమర్పించారు. కానీ.. ప్రభాకర్ రావు మాత్రం తనకేం తెలీదని.. శాఖాపరమైన ఆదేశాలు మాత్రమే ఇచ్చానని చెప్తున్నాడు. అదీకాకుండా--- ఉల్టా సిట్ అధికారులనే ప్రశ్నిస్తున్నాడు. నాపై ఉన్నతాధికారులను కూడా ఈ కేసులో ఎందుకు చేర్చలేదని సిట్ అధికారులనే ప్రశ్నిస్తున్నాడు. రెండోసారి విచారణకు ప్రభాకర్ రావును పిలిచిన సిట్ అధికారులు--- తన మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్, మ్యాక్ బుక్ లను తీసుకురావాలని సూచించారు సిట్ అధికారులు. దీంతో తాను వాడిన రెండు మొబైల్ ఫోన్లను సిట్‌కు అందజేశారు ప్రభాకర్ రావు. ఆ మొబైల్స్ నుంచి ఏవైనా ఆధారాలు సేకరిస్తే.. వాటిని కూడా ముందుంచి ప్రభాకర్ రావును విచారించనుంది.

# రండి.. మీరే లీడర్స్!

## యువతకు ఎమ్మెల్సీ కవిత బంపరాఫర్

### 'లీడర్' పేరిట రాజకీయ శిక్షణ తరగతులు.. పోస్టర్ ఆవిష్కరించిన ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

### తెలంగాణ జాగృతి రాజకీయ శిక్షణ వేదికగా మారబోతుందని ధీమా




**మహా:** రాజకీయాల్లోకి యువత రావడం ద్వారా స్వచ్ఛమైన రాజకీయాలకు నాంది పడుతుందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అభిప్రాయపడ్డారు. తెలంగాణ యువత, మహిళలకు రాజకీయ శిక్షణ అందించేందుకు తెలంగాణ జాగృతి 'లీడర్' కార్యక్రమాన్ని ప్రారంభించింది. యువతను రాజకీయాల్లోకి రప్పించి, సమాజంలో మార్పు తీసుకురావడానికి అవసరమైన నాయకత్వ నైపుణ్యాలను అభివృద్ధి చేయడం ఈ కార్యక్రమ లక్ష్యం. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. యువత, మహిళలకు తెలంగాణ జాగృతి ఒక రాజకీయ శిక్షణ వేదికగా మారబోతుందని తెలిపారు. తెలంగాణ గడ్డ అంటే ప్రశ్నించే తత్వం అని కవిత పేర్కొన్నారు. ప్రశ్నించే తత్వం మనతో ఆగవద్దని, ముందు తరాలకూ ప్రశ్నించే తత్వాన్ని నేర్పించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమం ద్వారా యువతలో ప్రశ్నించే ఆలోచనలను ప్రోత్సహించడం ముఖ్యమని స్పష్టం చేశారు కవిత. దీని కోసం తెలంగాణ వ్యాప్తంగా ప్రతీ నెల మూడు రోజులపాటు శిక్షణా తరగతులు నిర్వహించబడతాయన్నారు.

**సర్పంచ్ నుంచి మొదలుకుని..**

జులైలో హైదరాబాద్‌లో ప్రారంభించి, ఆగస్టు నుంచి జిల్లాల్లో ప్రారంభించనున్నట్లు కవిత తెలిపారు. ప్రజాస్వామ్యంపై ఆసక్తి ఉన్న ప్రతీ ఒక్కరూ ఈ శిక్షణా తరగతుల్లో పాల్గొనాలని కవిత కోరారు. ఇది ఒక నిరంతర కార్యక్రమంగా కొనసాగుతుందని ఆమె వెల్లడించారు. సర్పంచ్ నుంచి మొదలుకుని ఎమ్మెల్యే, ఎంపీ వంటి ప్రజాప్రతినిధుల విధులు, పరిధి, పరిమితులు అందరికీ తెలియాల్సిన అవసరం ఉందని కవిత ఈ సందర్భంగా పేర్కొన్నారు. ప్రజా సమస్యలను గుర్తించడం, వాటిని పరిష్కరించడం, అభివృద్ధికి నిధులు సాధించడం వంటి అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రజాసేవ చేయాలన్న సంకల్పం ఉంటే అన్ని దారులు ప్రజాసంక్షేమం వైపు వెళ్తాయని ఆమె అన్నారు. యువత, మహిళలు, తెలంగాణ వాదాన్ని ముందుకు తీసుకెళ్లే ప్రతీ ఒక్క నాయకత్వాన్ని ప్రోత్సహిస్తూ వస్తున్నామని కవిత పేర్కొన్నారు. చేసే పోరాటాలకు కూడా ఫలితం వచ్చే రోజు వస్తుందని ఆమె చెప్పారు. మహిళా రిజర్వేషన్ల చట్టం వచ్చినందున.. రాబోయే పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికల్లో 33 శాతం మహిళా అభ్యర్థుల నాయకులు కావాల్సిన అవసరం ఉంటుందని గుర్తు చేశారు. డీలిమిటేషన్ తర్వాత తెలంగాణలో అసెంబ్లీ సీట్లు 153కు పెరుగుతాయని, లోక్ సభ సీట్లు కూడా పెరుగుతాయని అన్నారు. కాబట్టి, మనం నాయకులను తయారు చేసుకోవాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు.

# సత్తుమల్లేష్ ఇంటి వేడుకకు హాజరైన కంది శ్రీనివాసరెడ్డి దంపతులు

**కరీంనగర్, మహా:** ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి దంపతులు కరీంనగర్ ను సందర్శించారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ,కరీంనగర్ జిల్లా గ్రంథాలయ చైర్మన్ సత్తు మల్లేష్ దంపతుల కుమారుడు , కూతురి నూతనవస్త్రాలంకరణ వేడుకలో పాల్గొన్నారు. చిన్నారులను ఆశీర్వదించి మల్లేష్ దంపతులను అభినందించారు. వేడుకకు తరలివచ్చిన మంత్రి సీతక్క, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, టిఎంఆర్ ఈ ఐఎస్ వైస్ ఛైర్మన్ ఫహీం ఖురేషీ, టూరిజం కార్పోరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి , కరీంనగర్ ఎమ్మెల్యే లు గంగుల కమలాకర్, విజయరమణారావు, సత్యం, పలువురు రాజకీయ ప్రముఖులను కలసి కంది శ్రీనివాస రెడ్డి ఆప్యాయంగా పలకరించారు.



మహా పత్రిక
తెలుగు
సోమవారం, హైదరాబాద్ | 16-06-2025



# పెన్షన్ జీవి



కమ్ముకున్న మొగులు గుమ్మ రిచ్చినట్టు
రిటైర్మెంట్ దినం రానే వచ్చింది
బడి గేటు దాటింది మతికస్తే
కండ్లల్ల లీల్లు కండ్లల్లనే తిరుగుతున్నయి

కనవడంగనే
రిటైరైనవా పైసలచ్చినయా
పానం మాటలేగాని
పోయిన మనిషిని గుర్తుజేసినట్లనిపిస్తది
సదులు లగ్గాల జాలిగొల్పుతున్నా
ఎండిన పుండును గెలికినట్లనిపిస్తది
గట్టిగున్నవు ఎమన్న జెయ్యరాదా
ఖుషీగ రెండుబుక్కలు ఎక్కొదినెట్టే అన్నా
ఇంకేజేసుడు ఇంకెంత జేసుడు
ఐపోళ్లు బతుకద్దా

మూడు పదుల మీద సాదిన జీతం
యాడాదంతా సాగిన రాతం
సగం జీతం మాట నెత్తిల దిర్గంగనే
పాడి బర్రె నడుమిరిగి పడ్డట్టు

పొద్దుగల్లనే గడియారం
బాత్రూంకు గుంజుక పోయినట్టు
తైలివట్టుకున్నా సంకలెక్కి కుసున్నట్టు
సద్దిడబ్బ శిన్న మొకంబెట్టినట్టు
ఆవునిలవడ్డా ఆమెనే టాటా జెసినట్లు
మందలకెల్లి తప్పిపోయిన గొడ్డలే
కొత్తగా లగ్గమైన కోడలోలే
బడికాయే మన్యాదంత

గంట గంటకు గంట సప్పుడుకు
శాతిల దడిల్లుమనుడు
ఖాళీగా కూసున్నా క్లాస్రూములున్నట్లు

ముసలిదోస్తులుఐపోళ్ల ఇసిత్రం సూపులు
అన్నీ ఎరిపిచ్చే ముచ్చట్లు
ఏ పని చెయ్యబుద్ధి గాదు
అట్లాని పాతిన గూటమోలే
కూసుండ బుద్ధి గాదు
శాయ యాల్ల తిండియాల్ల
పండు మెతిపినట్లు మతిజేసుకునుడు
అంగిన పొద్దును జూసి లాకిజేసుడు
రాత్రేప్పుడస్తదో అని.

సెరిసగం రాత్రి తెలిగా కడ
మందాలనే గుర్కా డ్యూటీ జేసుడు
కిటికిలకెల్లి జూసుడు
సుక్కెప్పుడు పొద్దును పిలుస్తదో అని

హైదరాబాద్ అమెరికా సదువులు
ఫ్లయిట్ ప్రయాణాలు
హార్ట్ బి పి షుగర్ భయం వార్తలు
తెల్లారి వాకింగ్ ముచ్చట్లు

పేపరంతా శాయల సప్పరిచ్చుడు
కుక్కపిల్లతో ఆడుకున్నట్లు
మాటిమాటికీ సెల్ఫోన్ని బునుకుడు

పానంగా జూసుకుంటున్నా
పిలగాండ్లమీదఅనుమానం
ఎచ్చాలేసి అండినా ముక్కిరుసుడే

అన్నీ జూసినా అంతట్లనే కుషీగున్నా
తక్కువ తినుడు,తక్కువ తిరుగుడు
తక్కువ మాట్లాడుడు
ఇప్పటి కైతే ఇదే మెంటేనెన్స్

ఎదురైనోళ్లంతా
ఇప్పుడిగ మస్త రాయచ్చంటున్నలు

రాస్తా రాస్తా
నడుమును బుదిరికిచ్చుకుంటా
శేతులను బతిమిలాడుకుంటా
అడవి మల్లెల కన్నీటి కథలు
తండ్రిలేని బడిపిల్లల ఎతలు
తల్లిలేని పిల్లల తండ్లాటలు
ఆదిమ తల్లుల అరిగోసలు
మోదుగు పూలముచ్చట్లు
పత్తికాటలు ముంచుడు దందలు
మైనింగ్ మాఫియాల హైటెక్ ప్లాన్లు
అన్ని రాస్తా అన్నిటిని రాస్తా
రాసుడయ్యేదాకా రాస్తనే వుంటా.

- డా. ఉదారి నారాయణ,
9441413666

## ఎస్.ఆర్ & బి.జి.ఎన్.ఆర్. ప్రభుత్వ ఆర్ట్స్ & సైన్స్ కళాశాల
(స్వయం ప్రతిపత్తి), ఖమ్మం

ఖమ్మం, ఎస్.ఆర్ & బి.జి.ఎన్.ఆర్. ప్రభుత్వ ఆర్ట్స్ & సైన్స్ కళాశాల (స్వయం ప్రతిపత్తి) తెలుగు విభాగం ఆధ్వర్యంలో ఈనెల 20, 21న 'శతజయంతి సాహితీమూర్తులు దాశరథిఆరుద్ర జీవితం, సాహిత్యంపై రెండు రోజుల జాతీయ సదస్సు నిర్వహిస్తున్నది. తెలంగాణ ఉన్నత విద్యామండలి, కమీషనర్ కళాశాల విద్య, తెలంగాణ, తెలంగాణ సాహిత్య అకాడమి సౌజన్యంతో నిర్వహిస్తున్న ఈ సదస్సులో రెండు తెలుగు రాష్ట్రాల నుండి వివిధ విశ్వవిద్యాలయ ఆచార్యులు, డిగ్రీ కళాశాలల అధ్యాపకులు 70కిపైగా పరిశోధనా పత్రాలను సమర్పించనున్నారు.

- సదస్సు కన్వీనర్
డా.పి.రవికుమార్




## రచనలకు ఆహ్వానం

సాహిత్య పేజీ కోసం కవులు, రచయితల నుండి కథలు, కవిత్వం, సాహిత్య వ్యాసాలు, పుస్తక సమీక్షలు మొదలైనవి..
మీ రచనలు పంపాల్సిన చిరునామా:
mahaapatrika@gmail.com
whatsapp 9247580946

## పుస్తక సమీక్షల కోసం...

తమ కొత్త పుస్తకాలను రెండు ప్రతులను ఈ దిగువ చిరునామాకు పంపించగలరు.
43/A, MLA Colony, Road No. 12,
Banjara Hills, Hyderabad. Telangana- 500034.

# వెలుతురూ, సౌందర్యమూ మనిషి కద్దుతున్న జాదూగర్ ఆశారాజు

" DESIRE never ends
The HEART is never fulfilled
It is only the body
That dissolves.
HOPE and LONGING know
No bounds."
~saint kabir.

ఉదాసీనత, నిర్లిప్తత, దాటవేత, మొహమాటం, ఊగిసలాట, పీటముడుల పెదాల మౌనం, రక్తపు జీర తొణకని ముఖ గాంభీర్యం ఇంకా ...ఇంకా... ఇట్లా...ఇట్లా పల్స్ దొరకని, మీటరందని సమాజ గమనంలో సుమారు 500 పైబడి ఏండ్ల కిందట భారతీయ సమాజంలో మరుగున పడని ఆధ్యాత్మిక, మార్మిక, సాధు, సూఫీ కవి, తత్వవేత్త సంత్ కబీర్ కవితా వాక్యాలు నేటికీ అచ్చు గుద్దినట్లే. 40 ఏండ్ల అనుభవరాశి లోంచి 22 పుస్తకాల్లో సారాంశం గా పైన పేర్కొన్నట్లుగా వాస్తవ జగత్తు తో పాగల్ షాయరీగా, రాజా హైదరాబాదీగా, కవిత్వం తప్ప ఇంకోటి తెలియని, మనుషులను ప్రేమించటం తప్ప మరోటి ఎరుగని అత్తర్, మొహబ్బత్ ల నిషానీ కవి ఆశారాజు దీ అదే బాటే. కబీర్ కు తనకు బహుశః పోలిక లేని తనమేదైనా వుంటే ఆధ్యాత్మిక ధ్యాసే. దేవుని ద్వారా మనిషిని చూశాడు కబీర్.


అనంత ప్రేమైక భావన ద్వారా మనిషి మనస్సనే ముంగిలిని చేరుకోవాలనుకుంటున్నాడీ కవిరాజు. కత్తి కంటే కలం గొప్పదనే సత్యం ఎల్లప్పుడు రుజువు పరిచేది కవే.

"'ఒక దినం ప్రతిదినం" గా తాజా ఆశాపుష్పం పూయించిన కలల బేహారి, పాతబస్తీ సునేరి రాజు గారి కవిత్వ ప్రయాణం, కవితా మహత్వం "ముఖం మీద సీతాకోక నీడ" లా కనిపిస్తుంది.
ఊహా, భావ, నిజ పద చిత్రాలతో బతుకు చిత్రాలను చిత్రవిచిత్రంగా అక్షర చిత్రిక పడుతుంటే, పఠితులు స్థానం మరచి స్థాణువులైన సందర్భాలెన్నో.
రాయైనా, పూవైనా తన చేతి కలంలో కవితా రమణీ లలామ గా సాక్షాత్కారం పొందడమే.
కవిత్వాన్ని అలవాటు గానో, అలవోక గానో, సీరియస్ గానో, కాజువాలిటీ గానో తీసుకునే కవు లుంటరు గావచ్చు. కవిత్వం ముందు చేతులు కట్టు కుని 'విధేయత' ప్రదర్శించే అరుదైన లక్షణానికి నిదర్శనమీ పంక్తులు.
"నేను రాసే ప్రతి కవిత
నాకు కొన్ని ప్రశ్నలు వేస్తుంది
పూర్తయిన కవిత
కొత్తపాఠం నేర్పుతుంది"

1991 "నేపథ్యం" నుంచీ కవి, పాఠక జనాన్ని కవిత్వ మోహంతో అలరిస్తూనే, ఆలోచింపజేస్తూనే, చైతన్య పరుస్తూనే వున్నారీ సీనియర్, ఉపమానాల క్కర లేని, ఎందరి ప్రఖ్యాత కవుల మనసులకో దగ్గ రైన ఆశారాజు గోపేరు సాహిత్యక్షేత్రంలో "ఎండ కన్నా పొడవు", వెన్నెల కన్నా విశాలం, శబ్దించే అత్తర్ వాక్యం.అంతేగాదు, ఎన్ని బాధల్లో వున్న మనిషైనా తన కవిత ఒక్కటి చదివినా refresh గా active గా మారిపోవటం ఖాయం.

వేదన, సంఘర్షణ, మోసం, హింస, ధనాశ, ఆకలి, వైరం, యుద్ధం, స్వార్థం, ప్రముఖంగా మనిషంటే మనిషికి పడకపోవటం, హిపోక్రసీ, జెలసీ, ప్రైవసీ కవిని ఊరకే ఉండనిస్తాయా? వీటికి అతీతమైన సమాజ నిర్మాణం కోసం స్వప్నాలు కనకుండా, అక్షరాల్లో ప్రతిష్టించకుండా, ఫలితంగా మనిషిని మేల్కొలపకుండా, ప్రతి 'నుదుటి మీద మనిషి' అని రాసే కవి ఉండలేదు.

వస్తు శిల్పాల కవిత్వ నిర్మాణ సూత్రాలు ఎట్లున్నా, ఎన్నున్నా హృదయాన్ని తడి చేసే కవిత్వమే బతు కుతుంది. బతికిస్తుంది. ఆ రసవిద్య లో తన కలం చాలా దూరమొచ్చింది.ఒక రకంగా తిలక్ గారిని గుర్తు తెచ్చే కవిత్వం తనది, అద్దాలు, అల్లంరబ్బా, అమ్ముకునే వాళ్ళ మీదా , ఉప్పుబండ్ల సంచార జీవుల మీదా తన సునిశిత చూపు ప్రసరించి అక్షరాలు




మొగ్గ తొడిగి, కవితా పుష్పాలై వికసించినై.

విశ్రాంత వయసులో కూడా యువ కలం యోధుల వేగం ధాటిని అధిగమించే రీతిలో వారం, రెండు వారాల్లో ఏదో పత్రికలో కనబడటం, నలుగురు తన కవిత గురించి మాట్లాడుకునేట్లు చేయటం ఒక తపః క్రియ గానే భావించవచ్చు.
మానవుడే అభివృద్ధి కి మూలం. మానవుడే వినాశనా నికి కేంద్రం. అపసవ్య ధోరణి చలామణిలో కొచ్చాక, బద్నాం చేస్తున్న, బద్నాం ఔతున్న "మనిషి" ఇప్పటి పుస్తకంలో శీర్షికలు కావటం వెనక మనిషిని పట్టిం చుకునే తనం అనివార్యంగా ప్రధాన కవితా వస్తువు గా స్వీకరించటం ఆశారాజు గారికే చెల్లింది. కవిత ల్లో సింహభాగం మనిషే ఆక్రమించాడు. పదాలను, వాక్యాలను ఎక్కడికక్కడ విరవటం, అసలు క్రియా పదాలే వాడకపోవటం, లేదా మొక్కుబడిగా వాడటం కాకుండా, క్రియా పదాలతో వాక్యాలను నిండుగా కవితాత్మకంగా అలంకరించటం, అక్కడక్కడ పాత బస్తీ భాష తెలుగు మిళితం చేసి, కర్ణపేయ శబ్దాలతో కట్టి పడేసే నిపుణత రాజు గారి రివాజు.

కవితా శీర్షికలు సైతం ఏక వాక్యంగా ఉత్సుకత, ఉద్వేగాలతో చదివించే వైపు మళ్ళించే జాణతనం కూడా ప్లస్సే.
పుటల్లో కెళ్ళితే,
"విరిగిపోయిన పడవ" లో నిర్మాణ చతురత పొడ చూపుతుంది. భావగర్భితమైనదీను. దాన్నుద్దేశించి
"ఏ ప్రేమికుల గుర్తో, ఏ ప్రయాణికుల కలో
సముద్రం ఒడ్డున పడివుంది"

అని రాస్తూ, మధ్యలో " కవిత్వం రాస్తానని చెప్పని కవిని" తీసుకొచ్చి. దాన్ని బాగు చేసే ప్రయత్నమే సౌందర్యంగా, పడవ సాగేది వెలుతురు దిక్కే గనక "వెలుతురే అతని కవిత్వమని" ముగించటం ఒక వినూత్న పంథా గా అనిపిస్తుంది.
కవి లోకానికి కాపలాదారు

." మొగిలిరేకుల వెన్నెల్లోమచ్చులుంటాయి
జాగ్రత్తగా కలలు కనాలి"
అనే హెచ్చరిక చేస్తూనే,
"జీవితంలో ఒక్క ఉదయం నాదంటూ దొరికితే చాలు
దారంతా ప్రేమను అలంకరించి పెడతాను"
అనే హామీ పడటం తన సామాజికతకు నిదర్శనం.
స్పందనలు, జ్ఞాపకాలు లేకుండా మనిషి ఉండడు. కాలచక్ర భ్రమణం లో ఋతువుల ప్రవేశాలు ఎట్లా యితే ఆపలేమో గడచిన జీవన నీడలు జీవితంలోకి జ్ఞాపకాలుగా తొంగిచూసినపుడు ఏం చేయ్యాలో చెప్పే తీరు, ఆకట్టుకుంటది.

"నిన్ను కలవడానికి
ఎన్నో ఋతువులు మారి
జ్ఞాపకాలు శ్రమపడి వస్తాయి-" అంటూ,
ఎట్లెట్ల కలవాలో చెబుతూ,
ఏకాంతంలో తనివితీరా కలువుమని,
వానచినుకుల్లా నిన్ను తడిపినప్పుడు, ఛత్రీ పారేసి, తడుస్తూ, మురుస్తూ కలువుమని, మురిపెపు దృశ్యా నుభవాలకు చేరువ చేస్తూ, గూళ్ళు చేరడానికి అవి వెళ్ళిపోయే ముందు,

" నీ దుఃఖం గురించి చెప్పకుండా
సాధించిన విజయాలు చూపించి
నీ మీద బెంగ పడకుండా ఓదార్చి
పంపించు." మని అంటారు.
జ్ఞాపకాల వెలికితీత కవితలే ఎక్కువ కనిపిస్తయి. అంగట్లో చాలా కాలం తర్వాత ఆత్మీయులెవరైనా కనపడితే బోరుమని ఏడ్చి,ఎత చెప్పుకునే పల్లెతనం చూస్తుంటం. పరిపక్వపు ప్రేమ ఎదుటి వారి సుఖాన్నే కోరుతుంటది. మనసు పొరల ఎక్కడో దాక్కున్న జ్ఞా పకాల కొక భౌతిక సుస్వరూపమిచ్చి, సాగనంపిన పెద్దరికపు మర్యాద గా ఈ కవిత ఎన్నదగినది.

శ్రీశ్రీ గారు కుక్కపిల్ల, అగ్గిపుల్ల, సబ్బుబిళ్ళ ను ఒక కోణంలో దర్శిస్తే,ఈ కవి గారు పగిలిన గ్లాసు, ము క్కలైన అద్దం, పర్రెలీడిన కల తో వ్యవస్థ ను ప్రశ్నింప చేయటం మరో కోణం.

కవిత్వం హాబీ కన్నా అంతరంగ శ్వాస అయ్యాక చూపు సమాజంలోకి మాత్రమే గాక ఆత్మ పరిశీలన లోకి సైతం చొచ్చుకు పోతుంది. తనని తాను 'ఏమ రుపాటు లేని బాధ్యత' లో వున్నానా లేదా అని గిచ్చి చూసుకొనే వాక్యాలు.
"ఓ స్వప్నమా నీవు అలా అలగకు
నీ కోసం సుఖాలన్నీ వదులుకుంటాను."
కబీర్ ఒకచోట అంటారు.
"Only they are pure who have completely cleaned their thinking."
నభం, జలం,అగ్ని, వాయువు, పృథ్వి
అను పంచ భూతాల తోనే గాక సూర్య చంద్రులను కూడా కలుపుతూ, వాటికి సమానంగా కవిని అంత స్థాయిలో పేర్కొనటం అతిశయోక్తి కానేరదు.
సత్యం మాట్లాడినందుకు భయంకర నిర్బంధా న్ని మోసిన ప్రొ. సాయిబాబా విడుదల పోయె మయ్యింది.
"జీవితాన్ని మాయాగుహను చేసి
బండరాళ్ళతో మూసేసి చూశారు" అంటూ,
పక్షి కళ్ళలో తెల్లవారింది,
స్వేచ్ఛగా రెక్కలాడిస్తూ
వీల్ చైర్ మీద సూర్యోదయమైంది"
ప్రకృతి కూడా ఆనందించే సన్నివేశాన్ని ప్రతీకాత్మకం గా చెప్పటం వెనుక కల్పిత మాయాగుహపై నిరసన ధ్వని కూడా వినవచ్చు.అట్లే వి.వి. సార్ మీద కూడా పోయెం వుంది.
అమానవీయ ఘటనలు వ్యక్తి చేసినా, మతం, కులం ,సమాజం చేసినా, రాజకీయం చేసినా ప్రతిఘటనా పద్యం పుట్టవలసిందే.
భాషా సౌందర్యం, ఊహా సౌందర్యం మిళితమై, అమూర్త భావనల సమ్మేళనంలో ఎగసిన సుస్వర మౌన నాదాలను " రాతి పెదాలు" ఒలికించిన విధానం అబ్బురమబ్బురమే. " ఊహల మీద కురిసే సొగసులు, భాంసురీ రాగాలు, నాట్యంలో తెగిపో యిన కాలిగజ్జె,నెమిలీకల నీడలు,పూల పరిమళం బాటసారిలా, పసిపిల్లల సువాసనల శ్వాసలా, అడుగుల సవ్వడుల ఉత్సవం, ఇట్లా కవితంతా ప్రతీకలు, పోలికలు సందడి చేస్తయి. చదివాక, ఒక మోహావేశం లో కొట్టుకు పోతాం. ప్రయోజకత్వం ఏమిటంటే,
"రాగం విరుపులతో
రాతి పెదాలు పిలిచా" యట
"మోహంతో, పుప్పొడిలా దుమ్ము రేగిన
దారి మలుపుల బదులు వినిపించిం"దట!
కోయిల కూతకు పిల్లవాడు బదులు కూత, మళ్ళీ కోయిల పిలుపు కూత, మళ్ళా పిల్లవాడు కూత. బా ల్యానందం ఆట అంతాయింతనా!
వినూత్నంగా రాస్తున్నారు కానీ విప్లవాత్మకంగా రాస్తున్నారా! విప్లవాల యుగం అంతరించిందా? కాలం వడపోతలో తేలే అంశం.
రాజు గారి కలం గుర్తు చేస్తున్నది. విప్లవం పుట్టుక, నడక, పరిణామం, అనుభవం, మొత్తంగా ఆ చరిత్ర ను, కొనసాగిన రీతిని ఒక రకంగా లక్షలాది పేజీల విప్లవ సారాన్ని ఒక కవితగా మలచటం ఆషామాషీ కాదు. అసామాన్య ప్రతిభా, సాహసాల కృత్యమే. విప్లవ ఉద్గ్రంథం లో ఒక పాఠ్యాంశంగా చేర్చే అర్హత వున్న కవిత. నేటి విద్యార్థులు ఈ కవిత చదివితే వి ప్లవోద్యమం సుబోధకం.ఎవరు ఏం చేశారు , ఎట్లా వ్యవహరించారు, ఏమై మిగిలారు,ఇంకా ఎట్లా వున్నారు, ఇప్పుడెట్లా వుంది, ఎట్లా చూడాలి, ఇన్ని ప్రశ్నలకి వాస్తవీకరణ చూపటం లో కవితీకరణ కొంత అతిశయోక్తి కి అవకాశం ఇవ్వొచ్చు.కానీ పాలలో పాలే కలిసినట్లు, కవిత్వ వాస్తవంలో, వాస్తవ కవిత్వంలో నిలబడే కవిత.


"నిప్పులో, నీటిలో,గాలిలో,మట్టిలో, మనిషిలో,మా టలో, ప్రేమలో.
ఇలా
విప్లవం పేజీలు కొట్టుకుంటున్న
ఉద్గంథంలా పడి వుంది"
వాస్తవ చిత్రణే కవిత్వ మైంది. విప్లవాన్ని చూస్తున్న చూపులో
"అజ్ఞాతంలో విప్లవం ఇంకా
మేఘాలను రాజేస్తున్న
ఉదయపు మిణుగురుల
సౌందర్యంలానే వుంది"
అంతిమంగా అటువైపు మళ్ళే,మళ్ళించే శక్తి వున్న దనే.
కవి క్రాంతదర్శి కనుక శాశ్వతత్వ పలుకులు కలం నుంచి ఒలికనై యిట్లా.
"సముద్ర గానంలా
షహెనాయి రాగంలా
ఎప్పటికీ విప్లవం బతికే వుంటుంది"
ఈ కవిని కదిలించిన ఇంకో కవి " విప్లవం యాదుం దిరాఆడనే నీ కూడుందిరా" అన్న మహాకవి శ్రీశ్రీ.
పట్టిందల్లా బంగారమైనట్లు, ఈ కలం దృష్టిలో పడ్డ ప్రతి సిరాచుక్క స్వాతిముత్యమై ప్రకాశిస్తది.
గత రెండేళ్ళలో రాసిన 153 కవితలన్నీ విశ్లేషణకు అంది వచ్చేవే.రీడబిలిటీ యే కాదు క్రెడిబిలిటీ పొంది వున్నవే. మనసు మీద ఎక్కువ పాటలు రాసిన సినీకవి ఆత్రేయ మరో రూపమే ఆశారాజు గారు అనుకునేలా మనిషే తన కేంద్రకమై ఇంచుమించు గా కవితలన్నీ జాలువారినై.
ముప్పిరిగొన్న భావుకత, విపులీకరించే పదాల అల్లిక, విషయాంబుధి ముట్టే ఆసక్తి, అధ్యయనం, కళాత్మక నిపుణత్వం, అలవికాని సృజన రచనాభిష క్తత వెనకాల అనంత శ్రమ.
ఎందుకనగా, తన ఇష్టం, ప్రాణం, ఊపిరి కవిత్వం. అవసరమా అంటే 'జాగా దొరకని మనసు', 'పడి పోయిన జీవితం', 'దర్ద్ కు దర్ద్ లేనితనం' , ' ఊడిపో యిన పుస్తకాలు', 'ఫ్లాట్ ఫారం నిద్రలు', 'పిచ్చివా ళ్ళ స్వప్నాలు', 'జ్ఞాపకాల వొంటరితనం', కళ్ళెదుట కలచివేస్తున్నందున, "జీవితానికి మాటిచ్చాను" అన్నప్పుడు అత్యంత, తక్షణ అవసరమే.
"Love does not grown
on trees or brought
in the market.
But if one wants to be
"LOVED"
one must first know
how to give
(UNCONDITIONAL) love"
సంత్ కబీర్ జీవితాన్ని, సమాజాన్ని కాచి వడబోసి, తేల్చి చెప్పిన సత్యవాక్కులు.
శకునులైనా, శత్రువులైనా, బాధాతప్తులైనా, బద్నాం చేసేవారైనా, మోసకారులైనా, హింసాకారులైనా,అ లిగేవాళ్ళైనా, ముఖం వెలిగేవాళ్ళైనా ఎవరి మీదా నింద వేయకుండా, గురుకుర్తా జేబుల్లో చేతులు పెట్టుకొని, షరతుల్లేని ప్రేమను పంచటానికి పారే నదిలా, ఎగిరే పక్షిలా, ముసిరే పరిమళంలా 'పోగొ ట్టుకున్న అందమైన వాటితో' కలిపి ,కవిత్వమూ పం చటానికి లోక యవనిక మీద తిరుగాడే జాదూగర్ కనిపిస్తే, మనిషీ హత్తుకో!

ఎందుకంటే,
"నిద్రపోవడం కలలు కనడానికి!
కలలో ఎప్పుడూ మేల్కొని వుండడానికి!"
ఈ కవి తపన, తపస్సు...

- దాసరాజు రామారావు,
96182 24503

# ఐదు దశాబ్దాల అక్షర ధార ఏకధార

'తెలంగాణ రాష్ట్రం మనకు వచ్చినాక తంగేడు పూలకు రాచరికం వచ్చింది..!' తెలంగాణ సాంస్కృతిక సామాజిక పునరుజ్జీవనం పట్ల కవికి వున్న కమిట్మెంట్ ఇది.దాదాపు ఐదున్నర దశాబ్దాల సుదీర్ఘ అక్షర ప్రయాణం. సాహితీ ప్రపం చంలో ఎన్నో తరాలను చూచిన వైనం. మారుతున్న కాలానికి అనుగుణంగానే తన రచనల శైలినీ,తీరు తెన్నులను మార్చుతూ కాలం పై తనదైన కవిత్వపు ఏకధారను కురిపించారు కందాళై రాఘవాచార్య.తన సుదీర్ఘ జీవన ప్రస్థానంలో కేవలం ఒకే ఒక కావ్యం తీసుకొచ్చారు.వంద కవితలతో తొలి ఆటలోనే చెది రిపోని, ఎవ్వరూ చెరపలేని "సెంచరీ"కొట్టి తనదైన రికార్డు సృష్టించారు ఏడుపదుల వయసున్న ఈ నవ యువ రచయిత.ఇప్పటికీ వివిధ ప్రముఖ దినపత్రికల ఎడిటోరియల్ పేజీలో తన ఆలోచనలతో పాఠకుల ను ఎంతగానో ప్రభావితం చేస్తుంటారు.జారిపోయే నిక్కరును పైకి లాక్కుంటూ నిర్భయంగా పరుగులు తీసే నాని పెదాల పైని నవ్వు ఔతుందా! ప్రతిరోజూ నీ కంటికి నా కంటికి ప్రశ్నార్థకమే నాలో నేను నీలో నువ్వు ఎప్పుడూ ఆశ్చర్యార్థకమే అంటూ తన బాల్యపు జ్ఞాపకాలను వివరిస్తూ,కొత్త డైరీ నిండా మళ్లీ పాత బడ్డ రోజులే! అంటూ కాలాన్ని పట్టుకోలేని చేతుల్లేని రోజులను చూపిస్తారు. మనల్ని తనదైన ప్రపంచంలోకి వచ్చేలా మన మనసులను లాగి పట్టి మరీ ఆహ్వానిస్తా రు. మన అరచేతినిండా సూర్యుని చూపిస్తాడు. ఇంకా గాంధీ 'కళ్ళజోడు' దేశాన్ని చూస్తూనే ఉంది ఎక్కడా అహింస హింస పాలు కారాదని గాంధీ చేతి 'కర్ర' మనకు ఇంకా ఊత ఇచ్చి నడిపించాలనే చూస్తోంది గాంధీ చదివిన 'భగవద్గీత' ఇంకా మనల్ని చదువ




మంటోంది. అంటూ తరాలు మారినా,ప్రభావం తగ్గని గాంధీ తత్వపు యొక్క ప్రాముఖ్యత ఇంకా పెరుగుతున్న ప్రస్తుత తరుణంలో ఈ లైన్లు మనల్ని ఆలోచింపచేస్తా యి.మన దేశానికే కాదు యావత్ ప్రపంచానికి అహిం సాయుత మార్గం ద్వారా నూతన ఒరవడిని సృష్టించిన మహాత్ముని మానవతా దృక్పథం ఎప్పటికీ ఆదర్శనీయ మైనదే, ఆచరణీయమైనదేనని కవి తన కవిత్వం ద్వారా స్పష్టంగా చెప్పినట్లు కనిపిస్తోంది!ఇరువురి రేపటి ఉనికి కోసం వర్తమానాన్ని ఆమె మాత్రమే శిశువుగా చేసి ఆడించగలదు ఆమె ముందుగా అమ్మై పురుషుడిని నాన్నగా చేయగలదు అంటూ గదిలోని కాలాన్ని ఘనీభ వించేలా చేయగలరు ఈ కవి.అద్భుతమైన ఆలోచింపజే సే భావాజాలంతో ఇలాంటి ఎన్నో లైన్లు పుస్తకం మొత్తం మీద మనకు దర్శనం ఇస్తూనే వుంటాయి.మనలో నూతనోత్సాహాన్ని నింపుతుంటాయి. బావిలో నీళ్లు కని పించడం లేదు పిల్లలు జారవిడిచిన గ్లాసులు చెంబులు సబ్బు పెట్టెలు తప్ప! ఊరి బావి ఎండిపోయింది!! ఆర్ద్రత తో నిండిన ఇలాంటి అక్షరాలను తడిమి చూస్తే మనకు తెలియకుండానే మన కళ్ళల్లో కన్నీటి ధారలు వస్తూనే ఉంటాయి. మనకు తెలియకుండానే మనల్ని ఏడిపిం చగలడు ఈ కవి..!చాలా జాగ్రత్తగా ఉండాలి మరీ..!
మా ఇంటికి కొత్త దానివి
మా జ్ఞాపకాలన్నీ నీవే
గోడకు కొత్త కళ వచ్చింది
కొత్త క్యాలెండర్
ప్రపంచం కలలను ఆవిష్కరిస్తుందంటూ పాఠకులను ఆశావాదంలోకి తీసుకెళ్తారు.క్యాలెండర్ జ్ఞాపకంతో తన అనుబంధాల ప్రవాహపు పరిమళాన్ని మనకు గుర్తుచేస్తూ మంచి అనుభూతి కవిత్వం అందిస్తారు రచయిత. "Poetry is the collection of the best and delightful moments of the joys and great minds" అంటారు ఓ ప్రముఖ కవి. అలాంటి వంద వచన కవితల ఆలోచనల అనుభవాల సమాహారమును తనదైన శైలిలో "ఈ నూరు కవితలు రేపటి నారు కవితలు అంటూ తన ఆత్మవిశ్వాసాన్ని ప్ర కటిస్తూనే తన అక్షర ఏకధారను మనపై ప్రేమగా కురిపి స్తూనే ఉంటారు..! మళ్ళీ మళ్ళీ చదవాలనిపించే పుస్తకం ఇది. నవ్యత, విభిన్నతతో కూడిన అంశాల మేళవింపుతో కందాళై రాఘవాచార్య ఓ అందమైన పెయింటింగ్ ల మనకు ఇచ్చిన కవితా బహుమానం ఈ ఏకధార.

- ఫిజిక్స్ అరుణ్ కుమార్, 9394749536



## చాలా దూరం నడవాలి

నిజమే చెప్తున్న
మనమింకా చాలా దూరం నడవాలి
ఎన్నెన్నో జ్ఞాపకాలను తలుచుకుంటూ
ఈ జీవితాన్ని మోసుకుంటూ
ఇంకా వేగంగా నడవాలి...!

నడుస్తున్నంత సేపు
వెనుకకు మాత్రం తిరగద్దు
నీడల్లా దూరంగా కనిపిస్తున్న
సాగిపోతున్న వాళ్లనే చూస్తూ
నవ్వుల కబుర్లను చెప్తూనే ఉండాలి...!

ఈ పయనం అనంతమైనది
దుఃఖాలను అధిగమిస్తూ
స్వార్థాలను తరిమేస్తూ
ద్వేషాలను పాతరవేస్తూ
దారిలోని సుమాలకు స్వేచ్ఛనివ్వాలి.!

- గోపగాని రవీందర్
9440979882

## మానేరు జలాశయంపై క్లీన్ కరీంనగర్ డ్యాం



**కరీంనగర్ మహా :** జలవిహార్ గ్రూప్ సభ్యుల ఆధ్వర్యంలో క్లీన్ కరీంనగర్ డ్యాం కార్యక్రమం లో భాగంగా మానేరు డ్యాం కట్టపై ఇరు వైపులా ఏపుగా పెరిగిన ముళ్ల చెట్లు, పిచ్చి మొక్కలు, చెత్తను తొలగిస్తూ జలా శయం పరిసర ప్రాంతాన్ని సుందరీకరిస్తున్నారు. ఆదివారం ఉదయం కరీంనగర్ మానేరు డ్యాం లేక్ వ్యూ పోలీస్ స్టేషన్ ఎస్ఐ రమేష్, జలవిహార్ గ్రూప్ సభ్యుల ఆధ్యర్యంలో క్లీన్ కరీంనగర్ డ్యాం కార్యక్రమాన్ని విజయవంతం చేసిన అధ్యక్షులు పాశం రాజిరెడ్డి, కలర్ సత్తన్న, రఘునందన్ రాజు, జలవిహార్ గ్రూప్ సభ్యులకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా జలవిహార్ గ్రూప్ సభ్యులకు ఉచిత రక్త పరీక్షలు నిర్వహించారు.

## ఆపదలో ఉన్న వారికి అండగా మన సనాతన హిందూ సేవా సమితి

**వరంగల్ మహా;** గ్రేటర్ వరంగల్ నగరంలో అనుకోని పరిస్థితులలో సర్వం కోల్పోయి ఆపదలో ఉన్న అభాగ్యులకు అండగా నిలుస్తూ మేమున్నామంటూ వారికి మనోధైర్యంతో పాటు కొంత ఆర్థికంగా తోడ్పాటును అందిస్తున్న మన సనాతన హిందూ సేవా సమితి సేవలను పలువురు అభినందిస్తున్నారు. ఈ సందర్భంగా మన సనాతన హిందూ సేవా సమితి నుండి 77 వ సేవా కార్యక్రమంలో భాగంగా చిన్న వయసులోనే భర్త మృతి చెందడం తో పిల్లల చదువులు, పోషణ భారంగా మారి ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న వరంగల్ నగరం కాశిబుగ్గ లోని శాంతి నగర్ కు చెందిన పర్లపెల్లి దీపిక కు రెండు నెలలకు సరిపడా బియ్యం, అలాగే నిత్యావసర సరుకులను అందించారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి వ్యవస్థాపకులు తాళ్లపల్లి నగేష్,,



అధ్యక్షుడు మిట్టపెల్లి వేణు, ఉపాధ్యక్షుడు అనుమాండ్ల రాజేందర్, సలహాదారు అంచూరి వేణు గోపాల్, గ్రూప్ సభ్యులు నోముల మహేష్ బాబు, గందమళ్ళ సాయి కుమార్, గంగిడి ధర్మారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## లోక్ అదాలత్ ద్వారా 13754 కేసులు పరిష్కారం

**వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్**


**హన్మకొండ మహా;** వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని వరంగల్, హన్మకొండ, జనగామ జిల్లాల్లోని న్యాయస్థాన ప్రాంగణంలోని శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ లో వరంగల్ పోలీస్ కమిషనరేట్‌కు సంబంధించి మొత్తం 13754 కేసులు పరిష్కారం జరిగాయని వరంగల్ పోలీస్ కమిషనర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ లోక్ అదాలత్ ద్వారా పరిష్కారమైన వివరాలను వరంగల్ పోలీస్ కమిషనర్ వెల్లడిస్తూ పోలీస్ స్టేషన్లల్లో నమోదైన ఎఫ్.ఐ.ఆర్ కేసులకు సంబంధించి మొత్తం 991 కేసులు పరిష్కారం కాగా ఇందులో సెంట్రల్ జోన్ పరిధిలో 455 కేసులు, ఈస్ట్‌జోన్ పరిధిలో 258, వెస్ట్‌జోన్ పరిధిలో 278 కేసులు లోక్ అదాలత్ ద్వారా పరిష్కారం అయ్యాయని, అలాగే డిసాస్టర్ మేనేజ్మెంట్ కేసులు 5248 కేసులు, ఈ పెట్టి కేసులు 4701, మోటార్ వెహికిల్ యాక్ట్ కేసులు2551లు




పరిష్కారించబడ్డాయి. ముఖ్యంగా సైబర్ నేరాలకు సంబంధించి పెండిరగ్‌లో ఉన్న 263 సైబర్ కేసుల్లో 1,06,52,078/ రూపాయలు సైబర్ బాధితులు డబ్బులు తిరిగి ఇవ్వాలిందిగా కోర్టు ఉత్తర్వులు జారీ చేయడంతో పాటు మరో 44 కేసుల్లో 20,81,188/` రూపాయలు సైబర్ బాధితులు అందజేయడం జరిగిందని వరంగల్ పోలీస్ కమీషనర్ తెలిపారు.

## అర్ధరాత్రి బాలాజీ బార్‌లో చోరీ

**కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు**





**వరంగల్ మహా;** ఇటీవల వరంగల్ సబ్ డివిజన్ లో దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్నాయి. పోలీసు అధికారులు చోరీల పై ఎన్ని అవగాహన కార్యక్రమాలు, ప్రకటనలు చేస్తున్నప్పటికీ దొంగలు వారి పనితనం చూపిస్తూనే ఉన్నారు. వరంగల్ నగరం నడిబొడ్డున గల పోచమ్మ మైదాన్ జంక్షన్ లో ఉన్న బాలాజీ బార్ & రెస్టారెంట్ లో అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తి బార్ లోకి చొరబడి చోరికి పాల్పడ్డాడు. శనివారం అర్ధరాత్రి సుమారు 1:20 సమయంలో చాకచక్యంగా బార్ లోకి దొంగ చొరబడి కౌంటర్ లో ఉన్న 6,800/ రూపాయల నగదును దొంగిలించినట్లు సమాచారం. ఈ దొంగ పనితనం అంతా బార్ లోని నిఘానేత్రాలలో నిక్షిప్తమైంది. ఆదివారం బార్ యజమాని ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. గతంలో కూడా ఇదే బార్ లో ఒకసారి దొంగతనం జరిగిందని బార్ యజమాన్యం తెలిపారు. నిత్యం 24 గంటలు అత్యంత రద్దీగా ఉండే పోచమ్మ మైదాన్ జంక్షన్ ప్రాంతంలోనే దొంగతనం జరగడంతో స్థానిక ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

## రెడ్ క్రాస్ అవార్డు అందుకున్న పోలీస్ కమిషనర్



**హన్మకొండ మహా;**

అత్యధిక సంఖ్యలో రక్తదానాన్ని చేసేందుకు ప్రోత్సాహించినందుకు గాను వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ కు ఆదివారం రాష్ట్ర గవర్నర్ చేతుల మీదుగా రెడ్ క్రాస్ అవార్డు అందుకున్నారు. ప్రపంచ రక్తదాత దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ లోని రాజ్ భవన్ సంస్కృతి కమ్యూనిటీ హాల్ లో ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర గవర్నర్, రెడ్ క్రాస్ రాష్ట్ర అధ్యక్షులు జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ హై బ్లడ్ డోనార్ మోటివేటర్ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ కు పోలీసు అధికారులు, పలువురు ప్రముఖులు, శుభాకాంక్షలు తెలిపారు.

# మేం లోకల్ పర్మిషన్ ఎందుకు..?

- అడ్డగోలుగా అక్రమ నిర్మాణాలు?
- అడ్డగా మారిన ఆదిభట్ల మున్సిపాలిటీ
- రాజకీయ నాయకుల అండదండలు..?
- G+2 అనుమతులు G+4,5 నిర్మాణాలు
- డ్రైనేజ్ వ్యవస్థనేలేని వెంచర్లో G+4,5 అంతస్తులా...?

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** ఆదిభట్ల మున్సిపాలిటీలో అక్రమ నిర్మాణాలకు అడ్డాగా మారింది. మున్సిపాలిటీ పరిధిలో నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాలను, అధికారులు అడ్డుకోవాలని పలువురు అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం, ఆదిభట్ల మున్సిపాలిటీ పరిధిలోని కొంగరకలాన్, మంగళపల్లి, ఆదిభట్లలో బహుళ అంతస్తుల నిర్మాణాలు చేపడుతున్నారు. మున్సిపాలిటీ నుంచి G+2 పరిమితి అనుమతులు మాత్రమే ఉండగా, ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తూ G+4,5 అంతస్తులు అక్రమంగా నిర్మిస్తున్నారు.

**ప్రభుత్వ నిబంధనలను బేఖాతరు...**

మున్సిపాలిటీకి చెందిన కొందరు వ్యక్తులు అధికార పార్టీని అడ్డం పెట్టుకొని, అడ్డగోలు నిర్మాణాలు చేపడుతున్నారని, ప్రభుత్వ నిబంధనలను బేఖాతరు చేస్తూ అక్రమ నిర్మాణాలకు పాల్పడుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఇదే అదునుగా చూసుకొని మరికొందరు అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు.

**రాజకీయ నాయకుల అండదండలు ఉంటే?**

మున్సిపాలిటీలో అక్రమంగా చేపడుతున్న నిర్మాణాలను నిలువరించడానికి వెళ్లిన అధికారులకు చేదు అనుభవం ఎదురవుతుంది. మంగళపల్లి, ఆదిభట్ల అధికార పార్టీకి చెందిన కార్యకర్తలు, కొందరు మాత్రం బహుళ అంతస్తులు నిర్మించుకోవచ్చు? మేము మాత్రం నిర్మించరాదా? అధికారంలో ఉన్న ప్రముఖుల అండదండలు ఉంటే, వారికి ఒక న్యాయం? మాకు ఒక న్యాయమా? అంటూ అధికారులను, బిల్డర్లు నిలదీస్తున్నారు. దీంతో ఏమి తోచని స్థితిలో అధికారులు అక్రమ నిర్మాణాలను నిలువరించలేక పోతున్నారు.

**డ్రైనేజ్ వ్యవస్థనేలేని వెంచర్లో బహుళ అంతస్తులు...?**


మున్సిపాలిటీ పరిధిలో నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాలను అధికారులు అడ్డుకోవాలని పలువురు అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. మంగళపల్లి, ఆదిభట్ల గ్రామాల రెవెన్యూ పరిధిలో చేపట్టిన వెంచర్లల్లో, భూగర్భ మురుగునీటి వ్యవస్థ, రోడ్లు, విద్యుత్ సరఫరా వంటివి లేకపోవడం, పరిమితికి మించి చేపడుతున్న భవనాల నుంచి వచ్చే వ్యర్థాలు రోడ్డుపై ఎటు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఇలాగే అక్రమ నిర్మాణాలు చేపడితే మురుగునీరు అంతా రోడ్డుపై పారడం జరుగుతుందని దీంతో దుర్వాసన రావడం విష జ్వరాలు ప్రబాలించడం జరుగుతుందని స్థానిక ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇలాంటి వాటికి తావు లేకుండా అధికారులు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించకుండా అధికారులు తగు చర్యలు తీసుకోవాలని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



## కరెంట్ తీగలు తెగిపడి... ఇద్దరు సజీవ దహనం

**సాగర్ రింగు రోడ్డు వద్ద ప్రమాదం.. ఇద్దరు భిక్షాటన చేసే వ్యక్తులు మృతి**

**ఎల్బీనగర్,మహా:** ఎల్బీనగర్ సాగర్ రింగు రోడ్డు లోని బాబాయ్ హోటల్ సమీపంలో శనివారం అర్ధరాత్రి 11కేవీ విద్యుత్ తీగలు తెగిపడడంతో ఇద్దరు భిక్షాటన చేసే వ్యక్తులు సజీవ దహనం వారితోపాటు ఓ వీధి కుక్క సైతం మృతి చెందింది. అర్ధరాత్రి వేళలో ఇంటికి వెళ్తున్న ఒక వ్యక్తి చూసి 100 నెంబర్ నుంచి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. వెంటనే ఎల్బీనగర్ పోలీసులు, విద్యుత్ శాఖ అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదాన్ని పరిశీలించారు. వైర్ బీడింగ్ తెగిపోవడంతో ఈ ఘటన జరిగిందని విద్యుత్ అధికారులు తెలిపారు. కరెంట్ తీగలు తెగిపడడంతో ఇద్దరు భిక్షాటన చేసే వ్యక్తులు (వీరిలో ఒకరు ఆడ, మరోకరు మగ) అక్కడికక్కడే సజీవ దహనం అయ్యారు. మృతదేహాలను అంబులెన్స్‌లో ఉస్మానియా జనరల్ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు



ఎల్బీనగర్ పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. విద్యుత్ శాఖ అధికారులు కూడా జరిగిన ప్రమాదంపై దర్యాప్తు చేస్తున్నారు.

## గుర్తింపు లేని ప్రయివేటు కళాశాలల పై చర్యలు తీసుకోవాలి

**ఏపీ ప్రయివేటు జూనియర్ కళాశాలల అసోసియేషన్ డిమాండ్**

**అనకాపల్లి జిల్లా ,సబ్బవరం మహా :** ఉమ్మడి విశాఖ జిల్లా వ్యాప్తంగా గుర్తింపు లేని ప్రైవేట్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ జూనియర్ కళాశాలల జాయింట్ మేనేజ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కే జనార్ధన్ రావు అన్నారు.ఎస్.ఎస్.ఎస్.ఎస్ కళాశాలలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా చాలా చోట్ల ఎటువంటి ప్రభుత్వ గుర్తింపు లేకుండా కళాశాలలు నిర్వహిస్తున్నట్లు మా దృష్టికి వచ్చిందని తెలిపారు.ఆ సమాచారం మేరకు దీనిపై అసోసియేషన్ సభ్యులతో కలిసి విచారణ జరపగా కొన్ని కళాశాలలకు అనుమతులు లేనట్లు గుర్తించమన్నారు.సబ్బవరం లో శ్రీ విషన్ అకాడమీ కళాశాల కు ఎటువంటి అనుమతులు లేనట్లు మా కమిటీ ద్వారా గుర్తించడం జరిగిందన్నారు.శ్రీ విషన్ అకాడమీ కళాశాల నిర్వహకం ను బయటపడిందన్నారు. దీంతో అసోసియేషన్ సభ్యులు అందరూ కలిసి మెయిల్ ద్వారా అనకాపల్లి జిల్లా కలెక్టర్ కు ,వ్రాత పూర్వకంగా డి.ఐ. ఈ. ఓ కు పిర్యాదు చేశామని తెలిపారు.అనంతరం గుర్తింపు లేని కళాశాలలో చదివించి విద్యార్థుల భవిష్యత్ ను పాడుచేయవద్దని తల్లిదండ్రులకు వారు సూచించారు. అనధికారికంగా నిర్వహిస్తున్న ఇటువంటి కళాశాలలో విద్యార్థుల ను చదివించి తమ పిల్లల భవిష్యత్తును పాడు




చేసుకోవద్దని పిల్లలను చేర్చే టప్పుడు కలశాలకు అన్ని అనుమతులు ఉన్నాయో లేదో గుర్తించి అన్ని అనుమతులు ఉన్నాయన్న నిర్ధారణ చేసుకున్న తరువాతే జాయిన్ చేయాలన్నారు. అలాగే సబ్బవరం మండలంలో గల శ్రీ విషన్ అకాడమీ కళాశాల పై చర్యలు తీసుకోవాల్సిందిగా డి. ఐ ఈ. ఓ సుజాత ను వారు కోరారు దీనిపై స్పందించిన డి ఐ ఈ ఓ తప్పకుండా గుర్తింపు లేని కళాశాలలో పై దర్యాప్తు జరిపించిన అనంతరం చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని జనార్ధన్ రావు తెలిపారు . ఈ సమావేశంలో రాష్ట్ర కమిటీ ఉపాధ్యక్షుడు అడపా శేషగిరిరావు ,ఈ. సి మెంబర్ కే నాగేశ్వరరావు ,బీ సెట్టి మురళి ప్రసాద్ ఏ.పీ జె .ఎం. ఏ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ కృష్ణమోహన్, జిల్లా ఉపాధ్యక్షుడు టి మాణిక్యాలరావు, అనకాపల్లి జిల్లా ఏపీజేఎంఏ గౌరవ అధ్యక్షులు పల్లి శేష్కరరావు పాల్గొన్నారు

## ఉప్పరిగూడ మల్లన్న ఆలయంలో చోరీ

**రంగారెడ్డి జిల్లా మహా:** మల్లన్న స్వామి ఆలయంలో ఆదివారం చోరీ జరిగిన ఘటన ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఈ ఘటనకు సంబందించిన వివరాలు పోలీసులు తెలిపిన ప్రకారం, రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం, ఉప్పరిగూడ గ్రామ పరిధిలో మల్లన్న దేవాలయం ఊరికి దూరంగా ఉంటుందని తెలిపారు. మల్లన్న దేవాలయానికి ఆదివారం సాయంత్రం అదే గ్రామానికి చెందిన ఎల్గపల్లి శ్రీరాములు దంపతులతో పూజ చేయటానికి వెళ్ళి చూడగా, దేవాలయం తాళ్ళాలు పగలగొట్టి, దేవతల విగ్రహాలు క్రింద పడి ఉన్నట్లు తెలిపారు. అమ్మవారి అభరణాలు చోరీకి గురైనట్లు అనుమానం వచ్చిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వెంటనే సంఘటన స్థలానికి హుటాహుటిన చేరుకున్న పోలీసులు, పరిసర ప్రాంతాన్ని పరిశీలించినట్లు తెలిపారు. గుర్తు తెలియని దుండగులు ప్రవేశించి, అమ్మవారి 7.5 గ్రాముల రెండు బంగారం మంగళ సూత్రాలు, వెండి మెట్టెలను దొంగలు చోరీ చేసినట్లు తెలిపారు. గ్రామస్తులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సిఐ ఐ జగదీష్ కేసు నమోదు చేసుకోని, దర్యాప్తు జరువుతున్నట్లు తెలిపారు.

## పితృ దినోత్సవం సందర్భంగా లక్ష్మారెడ్డిని సన్మానిస్తున్న కవులు రచయితలు




**కరీంనగర్, మహా:** పితృ దినోత్సవ సందర్భంగా భవాని సాహిత్య వేదిక అధ్యక్షులు డాక్టర్ వైరాగ్యం ప్రభాకర్ సంపాదకత్వంలో వెలువడిన నాన్నకు ప్రేమతో పుస్తకావిష్కరణ ఆదివారం రోజు కరీంనగర్ లోని వాగేశ్వరి పిజి కళాశాల లో ఆవిష్కరించారు , ఇట్టి కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రముఖ కవి రచయిత కీర్తి పురస్కార గ్రహీత ఎస్ వి రఘువీర్ ప్రతాప్ గారు, రచయిత విమర్శకులు , అమృత లత జీవన సాఫల్య పురస్కార గ్రహీత,దాస్యం సేనాధిపతి , కృషి రత్న అవార్డు గ్రహీత బుస్సా శ్రీనివాస్ గారు చింతల కిషన్ గారు హాజరైనారు, ఈ సందర్భంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న సీనియర్ సిటిజన్ నరహరి లక్ష్మారెడ్డి గారికి నాన్నకు ప్రేమతో మొదటి పుస్తకాన్ని అందజేసి ఘనంగా సన్మానించారు, ఈ కార్యక్రమంలో కవులు, రచయితలు, పాల్గొన్నారు

## నేడు రైతులతో ముఖాముఖి ముఖ్యమంత్రి

**రాజేంద్రనగర్ వ్యవసాయ విశ్వవిద్యాలయానికి సీఎం**
**రాష్ట్ర వ్యాప్తంగా రైతు భరోసా పథకం ప్రారంభం**

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** నేడు రంగారెడ్డి జిల్లా రాజేందర్ నగర్ లోని వ్యవసాయ విశ్వవిద్యాలయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సాయంత్రం నాలుగు గంటలకు రాష్ట్ర వ్యాప్తంగా రైతు భరోసా, రైతు వేదికలను లాంఛనంగా ప్రారంభిస్తారు. అనంతరం వ్యవసాయంలోని మెలకువలు, పంట దిగుబడి, రాబడి, పంట మార్పిడి వల్ల ప్రయోజనాలు, రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో శాస్త్రవేత్తలు రైతులకు చేసిన సూచనల గురించి ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, రైతులతో ముఖాముఖిగా ముచ్చటించనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయానికి పెద్దపీట వేయడం జరిగిందని, ఇంకా రైతులకు అందించాల్సిన కావలసిన సహాయ సహకారాల గురించి రైతులతో చర్చించనున్నారు.



## తప్పిపోయిన యువతిపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు...

**పరీక్షకు అని వెళ్లిన యువతి అదృశ్యం**
**ఇబ్రహీంపట్నం పిఎస్ లో సోదరుడు ఫిర్యాదు**

**రంగారెడ్డి జిల్లా మహా:** పరీక్షకు వెళ్ళిన యువతి తప్పిపోయిన ఘటన ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. రంగారెడ్డి జిల్లా, శంషాబాద్ కు చెందిన ఉంగరాల పవన్ కళ్యాణ్ అనే యువకుడు, తన సోదరి తప్పిపోయిందంటూ ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయడం జరిగింది. ఇబ్రహీంపట్నం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... శంషాబాద్ కు చెందిన ఉగరాల మేఘన(23) ఇబ్రహీంపట్నం మండలం, రాందాస్ పల్లి గ్రామ పరిధిలోని ఏవిఎన్ ఇంజనీరింగ్ కళాశాలలో చదువుతుంది. శుక్రవారం పరీక్షకు వెళ్తున్నానని చెప్పి ఇంటి నుండి బయలుదేరి కళాశాలకు వెళ్ళింది. కాగా సాయంత్రం అయినా ఇంటికి తిరిగి రాకపోవడంతో ఆమె సోదరుడు పవన్ కళ్యాణ్, ఆమె ఫోనుకు కాల్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చిందన్నారు. వెంటనే చుట్టుపక్కల వెతికి, ఆమె స్నేహితులను సంప్రదించగా, ఆమె పరీక్ష పూర్తయిన తర్వాత తనను తీసుకెళ్లడానికి తన బంధువు వస్తున్నాడని చెప్పి, కళాశాల బస్సు ఎక్కలేదని వారు అతనికి తెలిపారు. దీంతో అతను ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ లో, తన సోదరి తప్పిపోయిందంటూ ఫిర్యాదు చేయడం జరిగింది. ఫిర్యాదును అందుకున్న ఇబ్రహీంపట్నం పోలీసులు, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఐ జగదీష్ తెలిపారు..

## అవినీతి గురించి భారాసా నేతలు మాట్లాడటం దయ్యాలు వేదాలు వల్లించినట్లే

**భద్రకాళీ చెరువు పూడిక తీత పనుల్లో అవినీతి జరగలేదు**
**బహిరంగకు చర్చకు సిద్ధమన్న ఎమ్మెల్యే నాయిని**


**హన్మకొండ మహా;** హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం మాజీ ఎమ్మెల్యే వినయ్ భాస్కర్ చేసిన ఆరోపణల నేపథ్యంలో ఆదివారం వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, కుడా చైర్మన్ ఇనుగాల వెంకటరామిరెడ్డి తో కలిసి మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవినీతి గురించి బిఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడడం దయ్యాలు



వేదాలు వల్లించినట్టేనని అన్నారు. గతంలో మేము మా హయాంలో ఎంత తినాలో అంత తింటాము కానీ ఎవరు అడగొద్దని వాళ్ల పార్టీ నేతలే ఇంట్లో దెయ్యాలు ఉన్నాయని వారే అంటారు. నిజమైన దయ్యాలు ఎవరో ప్రజలకు తెలుసునని అన్నారు.

# పుణ్య స్నానాలకు వెళ్లి పరలోకానికి...

## బాసర గోదావరిలో మునిగి ఐదుగురు యువకులు మృతి



**ఆదిలాబాద్, మహా:** నిర్మల్ జిల్లా బాసర గోదావరి నది వద్ద విషాదఛాయలు అలుముకున్నాయి. పుణ్య స్నానాల కోసం బాసరకు వచ్చిన హైదరాబాద్ ప్రాంతంలోని చింతల్ కు చెందిన ఐదుగురు యువకులు రాకేష్ (17), వినోద్ (18), రితిక్ (18), భరత్, మదన్ (17)ఆదివారం గల్లంతయ్యారు.వివరాల్లోకెళ్తే హైదరాబాద్ కు చెందిన 22 మంది సన్నిహిత కుటుంబ సభ్యులు ఆదివారం పవిత్ర పుణ్యక్షేత్రం బాసర సరస్వతి అమ్మవారి దర్శనం కోసం వచ్చారు. గోదావరి నదిలో స్నానానికి వెళ్లగా నదిలో లోతైన ప్రాంతం గమనించకుండ ఐదుగురు యువకులు నీటిలో దిగి గల్లంతయ్యారు. కుటుంబ సభ్యుల కళ్ళముందే ఈ ఘటన జరుగుతున్న ఏమి చేయలేని నిస్సహాయ స్థితిలో ఉండిపోయారు. ఘటన స్థలంలో యాత్రికులు, పోలీసులకు సమాచారం ఇవ్వగా పోలీసులు హుటాహుటిన గజ ఈతగాళ్లతో నలుగురి మృతదేహాలను వెలికి తీశారు. మరొక యువకుని కోసం నదిలో గాలింపు చర్యల చేపట్టగా శవం లభ్యమైంది. మృతదేహాలను అంబులెన్స్ లో ఏరియా ఆసుపత్రికి తరలించారు. అంతకుముందు నీటిలో నుంచి గజ ఈతగాళ్లు శవాలను బయటికి తీయగా కుటుంబ సభ్యులు పీసీ ఆర్ చేసి బతికించుకోవడానికి కష్టపడుతున్న తీరు అక్కడున్న వారిని కంటతడి పెట్టించింది. ఏదేమైనప్పటికీ వర్షాకాలం మొదట్లోనే ఇలాంటి ఘటనలు జరగడం పట్ల భక్తులను భయాందోళనలను గురిచేస్తున్నాయని యాత్రికులు చెబుతున్నారు. చనిపోయిన వారిలో ముగ్గురు అన్నదమ్ములు కావడంతో ఆ తల్లిరోదన పలువురు ని కంటతడి పెట్టించింది.



# ఆపరేషన్ కగార్ ను వెంటనే నిలిపివేయాలి

**ఆదిలాబాద్, మహా:** ఆపరేషన్ కగార్ ను నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 17న హైద్రాబాద్ లో చేపట్టనున్న ధర్నాను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్ రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ధర్నాకు సంబంధించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం అయన మాట్లాడుతూ అడవుల్లోని ఖనిజ సంపదను దోచుకోవడానికి సర్కార్ పెద్దలు ప్రయత్నిస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా కేంద్రం స్పందించి మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని డిమాండ్ చేశారు.

# విమాన ప్రమాదం దిగ్భ్రాంతికి గురిచేసింది

**ఆదిలాబాద్, మహా:** అహ్మదాబాద్ లో ఇటీవల జరిగిన విమాన ప్రమాదం యావత్ దేశాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని వన్ టౌన్ సీఐ సునీల్ కుమార్ అన్నారు. విమాన ప్రమాద ఘటనలో ప్రాణాలు విడిచిన వారికి సనాతన హిందు ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఆదివారం నివాళులర్పించారు సమర్పించారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట గల కార్గిల్ పార్కులో అమరవీరుల స్థూపం వద్ద పుష్పాంజలి ఘటించారు. ప్రమాదంలో తనువు చాలించిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. మృతి చెందిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సమితి అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ప్రమోద్ కుమార్ ఖత్రి, గెడం మాధవ్, కందుల రవీందర్, సూర్యకాంత్, శశికాంత్, శ్రీకాంత్, సంతోష్ అగర్వాల్, సుభాష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఇంచార్జి మంత్రిగా సీతక్కనే కొనసాగించాలి




**ఆదిలాబాద్, మహా:** ఉమ్మడి అదిలాబాద్ జిల్లా ఇన్చార్జి మంత్రిగా ధనసరి సీతక్కనే యధావిధిగా కొనసాగించాలని తుడుం దెబ్బ రాష్ట్ర కమిటీ నేతలు డిమాండ్ చేశారు. స్థానిక కొమురం భీం కాలనీలో ఆదివాసీలతో కలిసి ఆదివారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తుడుం దెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గోడం గణేష్ మాట్లాడుతూ ఆదివాసి మహిళలు రాజకీయాల్లో జిల్లా ఇంచార్జ్ మంత్రిగా ధనసరి సీతక్క అన్ని వర్గాల ప్రజలతో మమేకమై వారి మన్ననలు పొందుతున్నారని అన్నారు. ముఖ్యంగా ఆదివాసీ సంస్కృతి సాంప్రదాయాలు ఆచార వ్యవహారాలతో పాటు ఆదివాసి చట్టాలు, హక్కులు, సమస్యలపై పూర్తిగా అవగాహన ఉండి వాటి పరిష్కారం కోసం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. జిల్లా ఇంచార్జ్ మంత్రిగా సీతక్కను మార్చడం ఆదివాసులను అవమానపరచడమే అవుతుందన్నారు. అణగారిన వర్గాల ప్రజల అభివృద్ధిని ప్రభుత్వం కోరుకుంటే సీతక్కను తిరిగి ఇంచార్జ్ మంత్రిగా నియమించాలన్నారు.






## సరూర్ నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్

# పారుపల్లి అనిత పుట్టిన రోజు వేడుకలు



**బాలాపూర్ మహా:** సరూర్ నగర్ డివిజన్ మాజి కార్పరేటర్ పారుపల్లి అనిత రెడ్డి గ పుట్టినరోజు సందర్భం గా వారి ఫ్యాక్టరి లో పని చేస్తున్న 40 మంది మహిళా కూలీలకు చీరల పంపిణి చేశారు. అమ్మ చేత ఫౌండేషన్,లయన్స్ క్లబ్ 320C గవర్నర్ కృష్ణ ప్రసాద్,వైస్ గవర్నర్ కృష్ణారెడ్డి,కోఆర్డినేటర్ కృష్ణారెడ్డి, శేఖర్ రెడ్డి,మూలవర్తి శ్రీనివాస్, శ్రీనివాస్ రెడ్డి,ప్రజా ప్రతినిధులు మంచినీళ్ల సుదర్శన్,తెలంగాణ ఆర్య వైశ్య సంఘం రాష్ట్ర నాయకుడు తాటికొండ రాఘవేంద్ర గుప్త,పారుపల్లి అనిత దయాకర్ రెడ్డి అభిమాన నాయకుల ఆధ్వర్యంలో 40 మంది వికలాంగులకు 2 క్వింటళ్ల బియ్యం తో పాటు నిత్యావసర సరుకులు పంపిణీ చేయడం జరిగింది. ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని,ప్రజలకు సేవ చేయాలని వారు ఆకాంక్షించారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికి కేంద్ర సంక్షేమ పథకాలను అందిస్తాం

## డివిజన్ అధ్యక్షులు వినయ్ రెడ్డి



**రాజేంద్రనగర్ మహా ;** బిజెపి డివిజన్ అధ్యక్షులు సూరెడ్డి వినయ్ రెడ్డి ఆధ్వర్యంలో బిజెపి నరేంద్ర మోడీ ప్రభుత్వం 11 సంవత్సరాలు దిగ్విజయంగా పూర్తి కావడంతో మైలార్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలోని లక్ష్మిగూడ ప్రభుత్వ పాఠశాలలో బిజెపి ఎస్సీ మోర్చ నాయకులు పార్లమెంట్ కన్వీనర్ జోగు రవి బిజెపి నాయకులతో కలిసి మొక్కలను నాటారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. 11 సంవత్సరాల భారతదేశం అన్ని రంగాల్లో ముందుకెళ్లిందన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద ఐదవ ఆర్థిక వ్యవస్థగా మన దేశం మోడీ ప్రభుత్వంలో ఎదిగిందన్నారు. 11 సంవత్సరాలలో దేశం అన్ని రంగాల్లో దూసుకుపోతుంది. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అనేక సంక్షేమ ఫలాలను అర్హులైన పేదలకు అందిస్తున్నామన్నారు. ఫసల్ యోజన, ఆవాస్ యోజన, ప్రధానమంత్రి శ్రమ యోగి మందన్ యోజన, స్టార్ట్ అప్ ఇండియా, డిజిటల్ ఇండియా, వన్ నేషన్ వన్ రేషన్ కార్డ్, భేటీ బచావో బేటి పడావో, ప్రధానమంత్రి కౌశాల్ వికాస్ యోజన, ప్రధానమంత్రి గ్రామీణ ఆవాస్ యోజన, ఆయుష్మాన్ భారత్, కిసాన్ సమృద్ధి, సుకన్య సమృద్ధి, అనేక రకాల సంక్షేమ పథకాలను కేంద్ర ప్రభుత్వం తెలంగాణ ప్రజలకు అందిస్తుందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరు సంక్షేమ పథకాలను వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు బిజెపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్యమే మహాభాగ్యం

## ప్రతి సంవత్సరం హెల్త్ క్యాంపును నిర్వహించాలి.. మాజీ చైర్మన్ కస్తూరి నరేందర్




**రాజేంద్రనగర్ మహా ;** మణికొండ అంజలి గార్డెన్స్ అసోషియేషన్ హాస్పిటల్ అధ్వర్యంలో హెల్త్ క్యాంపును ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమనికి ముఖ్య అతిధి గా మణికొండ మున్సిపల్ మాజీ చైర్మన్ కస్తూరి నరేందర్ హాజరయ్యారు. హెల్త్ క్యాంపులో భాగంగా బ్లడ్ క్యాంప్ కూడా నిర్వహించారు. చుట్టుముట్టు పరిసర ప్రాంతాల్లోని ప్రజలకు హెల్త్ క్యాంపులో సీజనల్ వ్యాధులకు సంబంధించిన మందులను పంపిణీ చేశారు. ఆరోగ్యానికి కాపాడుకుంటూ ముందు జాగ్రత్తగా సంవత్సరంకు ఒకసారి బాడీ చెకప్ చేసుకోవాలన్నారు. భవిష్యత్తులో రోగాలను దారి చేరినివాకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ అధ్యక్షులు జితేందర్, మాజీ కౌన్సిలర్లు పురుషోత్తం, తాజ్ భాయ్ సీనియర్ నాయకులు హనుమంత్ కుమార్, రత్నవల్లి తదితరులు పాల్గొన్నారు.

# ఆపరేషన్ కగార్ ను వెంటనే నిలిపివేయాలి

## మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలి

## సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య డిమాండ్




**రాజేంద్రనగర్ మహా ;** ఆపరేషన్ కగారు వెంటనే నిలిపివేయాలి, మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని, సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శాంతి చర్చల కమిటీ ఆధ్వర్యంలో ప్రచురించిన గోడపత్రికలను ఆదివారం శంషాబాద్ కార్యాలయంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు పానుగంటి పర్వతాలు, కే రామస్వామి, జిల్లా కార్యవర్గ సభ్యులు రామకృష్ణ, భారతరాజు, నరసింహ, మండల కార్యదర్శి నర్ర గిరి, జిల్లా సమితి సభ్యుడు చంద్ర యాదవ్ తో కలిసి గోడపత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దండకరణ్యం అడవిలో నల్లగుట్టలో ఆపరేషన్ కగార్ పేరుతో 2000 మంది మావోయిస్టులను ఎన్కౌంటర్ చేయడం లక్ష్యంగా కేంద్ర బలగాలు చుట్టుముంటాయి, తక్షణమే మావోయిస్టులతో శాంతి చర్చలు నిర్వహించి వారిని జనజీవన స్రవంతిలోకి తీసుకొచ్చే ప్రయత్నం చేయాలని పాలమాకుల జంగయ్య డిమాండ్ చేశారు. జూన్ 17న ఇందిరా పార్క్ లో మహాధర్నా కార్యక్రమం శాంతి చర్చల కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్నందున, రంగారెడ్డి జిల్లా నుండి వందలాదిమంది నాయకులు కార్యకర్తలు తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ కార్యదర్శి వద్ల సత్యనారాయణ, మహిళా సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మంజుల, ఇన్సాబ్ సంఘం జిల్లా అధ్యక్షులు మీనాక్షి తదితరులు పాల్గొన్నారు.

# భరద్వాజ్ ను సన్మానించిన ఎమ్మెల్సీ నాగరకుంట నవీన్ రెడ్డి

## యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ లో 905 వ ర్యాంక్ సాధించిన భరద్వాజ్



**షాద్ నగర్, మహా:** ఇటీవల విడుదల అయిన యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఫలితాలలో షాద్ నగర్ పట్టణానికి చెందిన పరిగి నాగమణి మనోహర్ దంపతుల కుమారుడు భరద్వాజ్ సివిల్స్ లో 905 ర్యాంక్ సాధించిన సందర్భంగా షాద్ నగర్ లోని డ్రీమ్ ల్యాండ్ కాలనీలో వారి నివాసనికి వెళ్లి భరద్వాజ్ ని అభినంధించి శాలువా తో సన్మానించారు ఎమ్మెల్సి నవీన్ రెడ్డి.కష్టపడి ర్యాంకు సాధించి వారి తల్లిదండ్రుల ఆశయాలు నెరవేర్చిన భరద్వాజ్ ని అభినందిస్తూ రానున్న రోజుల్లో మరింత ఉన్నత స్థాయికి వెళ్లి మంచి గుర్తింపు పొందాలని ఆకాంక్షించారు ఎమ్మెల్సి నవీన్ రెడ్డి.ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు , నాయకులు కానుగు అనంతయ్య, నందకిషోర్ , దినేష్ సాగర్,అన్వారీ రాజు తదితరులు పాల్గొన్నారు.



# టెక్ దిగ్గజంలో తొలగింపులు

కంప్యూటర్లను తయారు చేసే ప్రముఖ టెక్నాలజీ కంపెనీ ఇంటెల్ పెద్ద సంఖ్యలో ఉద్యోగులను తొలగించేందుకు సిద్ధమైంది. తమ ఫ్యాక్టరీల్లో పని చేసే ఉద్యోగుల సంఖ్యను గణనీయంగా తగ్గించుకునేందుకు ప్రణాళిక వేసింది. వచ్చే జూలై మధ్యలో తొలగింపుల ప్రక్రియ ప్రారంభమై నెలాకరు కల్లా పూర్తికానుంది. కొత్త సీఈవో లిప్ బు టాన్ వచ్చాక ఇది తొలి, భారీ ఉద్యోగాల కోత కానుంది.

ఉద్యోగుల తొలగింపు విషయాన్ని ఇంటెల్ నేరుగా ప్రకటించనప్పటికీ ఈమేరకు కంపెనీ ఉద్యోగులకు ఇంటర్నల్ మెమోల ద్వారా తెలియజేసినట్లు పలు అంతర్జాతీయ వార్త పత్రికల్లో కథనాలు వచ్చాయి. కంపెనీ తన అంతర్గత తయారీ విభాగమైన ఇంటెల్ ఫౌండ్రీలో కార్యకలాపాలను క్రమబద్ధీకరించుకుని, మరింత చురుకైన సంస్థగా మారాలని లక్ష్యంగా పెట్టుకుందని, అందులో భాగంగానే ఉద్యోగ కోతలు చేపడుతోందని పేర్కొన్నాయి.

కంపెనీ చేపడుతున్న ప్రస్తుత తొలగింపుల్లో ఎంత మందిపై ప్రభావం పడుతుందనే విషయం వెల్లడికాలేదు. సీనియర్ నాయకత్వం నిర్దేశించిన ఆర్థిక లక్ష్యాలను చేరుకునే వరకు, తొలగింపులను అమలు చేయడంలో వ్యాపార యూనిట్లకు విచక్షణ ఉంటుందని సంబంధిత వర్గాలు సూచిస్తున్నాయి. పర్సనల్ కంప్యూటర్లు, ల్యాప్‌టాప్ మార్కెట్లో డిమాండ్ పడిపోవడం, అమ్మకాలు క్షీణించడం, మరోవైపు ఎన్‌విడియా, ఏఎండీ వంటి ప్రత్యర్థుల నుంచి గట్టి పోటీ నేపథ్యంలో ముఖ్యంగా ఏఐ ఫోకస్డ్ హార్డ్ వేర్ లో ఉద్యోగ పునర్నిర్మాణంపై ఇంటెల్ దృష్టి పెట్టినట్లుగా తెలుస్తోంది.

## విప్రోలో మళ్లీ చేతులు మారిన ప్రమోటర్ల వాటాలు



ఓపెన్ మార్కెట్ లావాదేవీల ద్వారా ఐటీ దిగ్గజం విప్రో ప్రమోటర్ల వాటాలో 1.72 శాతం చేతులు మారింది. స్టాక్ ఎక్స్ఛేంజీ దిగ్గజాలు బీఎస్ఈ, ఎన్ఎస్ఈ సమాచారం ప్రకారం 1.72 శాతం వాటాకు సమానమైన 18.05 కోట్ల ఈక్విటీ షేర్లను అజీమ్ ప్రేమ్‌జీ ట్రస్ట్ విక్రయించింది. వీటిని షేరుకి రూ. 259 సగటు ధరలో ప్రమోటర్ గ్రూప్‌నకు చెందిన ప్రజీమ్ ట్రేడర్స్, జాష్ ట్రేడర్స్ కొనుగోలు చేశాయి. డీల్ విలువ రూ. 4,675 కోట్లుకాగా.. సోమవారం (9న) సైతం అజీమ్ ప్రేమ్‌జీ ట్రస్ట్ 1.93 శాతం వాటాకు సమానమైన 20.23 కోట్ల షేర్లను విక్రయించిన సంగతి తెలిసిందే. వీటిని షేరుకి రూ. 250 సగటు ధరలో ప్రేమ్‌జీ ఇన్వెస్ట్‌కు చెందిన ప్రజీమ్ ట్రేడింగ్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ కంపెనీ, హర్షమ్ ట్రేడర్స్ అండ్ ప్రజీమ్ ట్రేడర్స్ కొనుగోలు చేశాయి. డీల్ విలువ రూ. 5,057 కోట్లుకాగా.. గతేడాది నవంబర్‌లో ప్రజీమ్ ట్రేడింగ్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ కంపెనీ ద్వారా ప్రేమ్‌జీ ఇన్వెస్ట్ 1.6 శాతం వాటాకు సమానమైన 8.49 కోట్ల విప్రో షేర్లను కొనుగోలు చేసింది. ఇందుకు రూ. 4,757 కోట్లు వెచ్చించింది. అయితే వీటిని ప్రజీమ్, జాష్ ట్రేడర్స్ వీటిని విక్రయించడం గమనార్హం!



# ఇలా చేస్తే.. ఇంటి పైకప్పు అదుర్స్!

ఫాల్స్ సీలింగ్‌తో ఇంట్లోని వాతావరణాన్ని అందంగా, ఆహ్లాదకరంగా మార్చుకోవచ్చు. దీంతో పాటు సాధారణ ఇంటి పైకప్పును డైమండ్, చతురస్రం, గోళాకారం వంటి విభిన్న ఆకృతుల్లో అందంగా తీర్చిదిద్దుకోవచ్చు కూడా. ఇంటి అందాన్ని ద్విగుణీకృతం చేసే ఫాల్స్ సీలింగ్ రంగుల ఎంపికలో జాగ్రత్తలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. గోడ రంగుతో పోల్చుకుంటే సీలింగ్‌కు వేసే వర్ణం తేలికగా ఉండాలి. అప్పుడు పైకప్పు తక్కువ ఎత్తులో ఉందనిపిస్తూ, విశాలంగా ఉన్న భావనను కలిగిస్తుంది. ముదురు షేడ్లను ఎంచుకుంటే పైకప్పు ఎత్తులో ఉందన్న అభిప్రాయాన్ని కలిగిస్తుంది. మిగతా గదులతో పోల్చుకుంటే పడకగది సీలింగ్‌నే ఎక్కువసేపు చూస్తాం కాబట్టి వర్ణాల్లో సాదాసీదావి కాకుండా నేటి పోకడలకు అద్దంపట్టేవి ఎంచుకోవాలి. మధ్యస్తం, డార్క్, బ్రౌన్ వర్ణాలు పడకగదికి చక్కగా నప్పుతాయి. ఎందుకంటే ఈ వర్ణాలు ఉత్సాహపరిచే విధంగా, స్వభావానికి అనుకూలంగా ఉంటాయి మరి. తాజాదనం ఉట్టిపడుతున్న లుక్ రావాలంటే మోనోక్రోమాటిక్ థీమ్‌ను ఎంచుకోవాలి. రెండు, మూడు వర్ణాలు కలిసినవి ఎంచుకుంటే మాత్రం అది పడక గది గోడలకు వేసిన రంగు కంటే తేలికగా ఉండేలా చూసుకోవాలి. అప్పుడే మీ సీలింగ్ ప్రశాంత భావనను కలగజేస్తుంది. గోడల రంగుకు, సీలింగ్‌కు ఒకే రకమైంది కాకుండా.. వేర్వేరు వర్ణాల్ని వేసుకోవచ్చు. దగ్గర రంగులు కాకుండా, చూడగానే తేడా ఇట్టే కనిపించే వర్ణాలను ఎంపిక చేసుకోవటం మేలు. దృశ్య వ్యక్తీకరణ ప్రదేశంగా సీలింగ్‌ను వినియోగించుకోండి. ఆహ్లాదభరితమైన ఆకాశం, లేదంటే గదితో కలిసిపోయేలా ఆకట్టుకునే ఆకారాలు, వర్ణాలతో నాటకీయత కన్పించేలా అలంకరించుకోవచ్చు.

### జాగ్రత్తలివే..

- ఫాల్స్ సీలింగ్ ఎంపికలో ధర కంటే నాణ్యతకే ప్రాధాన్యమివ్వాలి.
- ఫ్లోర్ నుంచి పైకప్పు మధ్య కనీసం 10-12 అడుగుల ఎత్తు అయినా ఉండాలి.
- ఏమరుపాటుగా ఉంటే ఫాల్స్ సీలింగ్‌తో పాటు ఎయిర్ కండిషన్ మెషిన్ కూడా పాడయ్యే అవకాశం ఉంటుంది.
- ఉడెన్ ఫాల్స్ సీలింగ్‌లో అయితే ఎలుకలతో పాటు చెదలు, పురుగులు చేరే అవకాశం ఉంది. కాబట్టి జాగ్రత్త వహించాలి.
- దుమ్ము, ధూళి చేరకుండా అప్పుడప్పుడు శుభ్రం చేయాలి.

# పాన్ కార్డు అలాగే వాడుతున్నారా? కట్టండి రూ.10వేలు!!

పాన్ కార్డు, ఆధార్ లేకుండా నేటి కాలంలో ఆర్థికపరమైన ఏ పనినీ పూర్తి చేయడం సాధ్యం కాదు. దీన్ని దృష్టిలో ఉంచుకుని పాన్, ఆధార్ అనుసంధానాన్ని తప్పనిసరి చేసింది ప్రభుత్వం. అయితే ఇప్పటికీ చాలా మంది తమ పాన్ కార్డును ఆధార్ తో లింక్ చేసుకోలేదు. అలాంటి వారి పాన్ కార్డులు ఇనాక్టియావ్‌గా మారాయి. అయినప్పటికీ కొందరు ఆర్థిక లావాదేవీల్లో ఇనాక్టివ్ పాన్ కార్డులను అలాగే ఉపయోగిస్తున్నారు. ఇలాంటి వారు ఆదాయపు పన్ను చట్టంలోని సెక్షన్ 272బి కింద కఠిన చర్యలు ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఈ సెక్షన్ కింద ఒక్కో లావాదేవీపై రూ.10,000 వరకు జరిమానా విధించవచ్చు. ఈ దిశగా ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. ఎవరైనా ఆర్థిక లావాదేవీల్లో ముఖ్యంగా అధిక విలువ కలిగిన లావాదేవీలలో ఇనాక్టివ్ పాన్ ఉపయోగిస్తే ప్రతి సందర్భంలో ప్రత్యేక జరిమానా విధించవచ్చని ఆదాయపు పన్ను శాఖ చెబుతోంది. బ్యాంకు ఖాతా తెరవడం లేదా నిర్వహించడం, షేర్లు లేదా మ్యూచువల్ ఫండ్లలో పెట్టుబడి పెట్టడం, ఆస్తిని కొనుగోలు చేయడం, రుణం కోసం దరఖాస్తు చేయడం, ఆదాయపు పన్ను రిటర్నులు దాఖలు చేయడం వంటి లావాదేవీలు ఇందులో ఉన్నాయి.

**రెండు పాన్ కార్డులున్నా తప్పే..**

ఒక వ్యక్తి రెండు పాన్ కార్డులు కలిగి ఉండటం చట్టరీత్యా నేరం. ఇలాంటి వారు రెండింటిలో ఒక పాన్ కార్డును సరెండర్ చేయాలి. అలా చేయకుండా పట్టుబడితే ప్రభుత్వానికి వివరణ ఇవ్వాల్సి ఉంటుంది. కొన్ని కారణాల వల్ల కొంతమందికి రెండు పాన్ కార్డులు ఉండవచ్చు. ఉదాహరణకు పాన్ కార్డు వివరాల్లో తప్పులున్నప్పుడు, పెళ్లి తర్వాత ఇంటి పేరు మార్పు కోసం కొత్త పాన్ కార్డు తీసుకొని ఉండవచ్చు. ఇలా రెండు పాన్ కార్డులు కలిగి ఉంటే ఎలాంటి జరిమానా విధించకుండా వదిలేస్తారు. అదే ఉద్దేశపూర్వకంగా రెండు పాన్‌కార్డులు పెట్టుకుంటే మాత్రం కఠిన చర్యలు తప్పవు. కాబట్టి ఎవరి దగ్గరైనా రెండు పాన్ కార్డులు ఉంటే వెంటనే సరెండర్ చేయడం మంచిది.




## దేశం-విదేశం NATIONAL-INTERNATIONAL


# పూణెలో ఘోర ప్రమాదం

## బ్రిడ్జి కూలి ఆరుగురు మృతి.. 25 మంది గల్లంతు

**మహారాష్ట్ర:** పూణెలో ఘోర ప్రమాదం జరిగింది. ఆదివారం మధ్యాహ్నం ఇంద్రాయణి నదిపై పురాతన కూలిన వంతెన కూలింది. ఈ ఘటనలో ఆరుగురు మృతి చెందారు. 25మంది గల్లంతయ్యారు. పోలీసుల సమాచారం మేరకు.. పుణె జిల్లాలోని మావళ్ తాలూకాలోని తలెగావ్ దాభాడే వద్ద విషాదం చోటు చేసుకుంది. ప్రసిద్ధ పర్యాటక ప్రాంతం కుండమళా వద్ద ఆదివారం మధ్యాహ్నం 3.30గంటల సమయంలో ఇంద్రాయణి నదిపై ఉన్న పాత బ్రిడ్జ్ ఆకస్మాత్తుగా కూలింది. ఈ దుర్ఘటనలో ఆరుగురు మృతి చెందారు. 20 నుంచి 25మంది బ్రిడ్జి కింద ప్రవహిస్తున్న ఇంద్రాయణి నదిలో గల్లంతయ్యినట్లు తెలుస్తోంది. పర్యాటక ప్రాంతం కావడంతో వీక్షించేందుకు పర్యాటకులు పెద్ద ఎత్తున పర్యాటకులు తరలి వచ్చారు. అయితే, రెండు రోజులు పాటు భారీగా కురిసిన వర్షాలకు పురాతన బ్రిడ్జి నానింది. పర్యాటకులు రావడంతో బ్రిడ్జి కూలిపోయింది. బ్రిడ్జి కింద ప్రవహిస్తున్న ఇంద్రాయణి నదిలో జారీ పడ్డారు. ప్రమాదంపై సమాచారం అందుకు ఎన్‌డీఆర్ఫ్ బృందాలు బాధితుల కోసం గాలింపు చర్యల్ని ముమ్మరం చేశారు. ఐదుగురు పర్యాటకుల్ని రక్షించారు. ఈ దుర్ఘటనతో పింప్రిచించ్వడ్ పోలీస్ కమీషనరేట్ పరిధిలోని తలెగావ్ దాభాడే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. రెస్క్యూ ఆపరేషన్ చేపట్టారు. అధికార యంత్రాంగం, స్థానికులు సహాయక చర్యల్లో పాల్గొంటున్నారు.



### ఇజ్రాయెల్ ప్రధాని కీలక నిర్ణయం..
## కుమారుడి పెళ్లి వాయిదా!




దాడులు, ప్రతిదాడులతో ఇజ్రాయెల్ ఇరాన్‌ల మధ్య భీకర యుద్ధం సాగుతోంది. పలువురు ఇరాన్ సైనిక సారథులు, అణు స్థావరాలు, సైనిక స్థావరాలు, అణు శాస్త్రవేత్తలు, సైనిక ముఖ్యలను సమాధి చేసిన ఇజ్రాయెల్.. ప్రళయ భీకరంగా విరుచుకుపడుతోంది. మరోవైపు, సైన్యాధికారులను కోల్పోయి.. స్థావరాలను కోల్పోయి ఆయుధపరంగా, శాస్త్రవేత్తలను కోల్పోయి విజ్ఞానపరంగా ఎంతో నష్టాన్ని చవిచూసిన ఇరాన్ కూడా ప్రతికార దాడులకు దిగుతోంది. వందల కోద్దీ డ్రోన్లు, బాలిస్టిక్ క్షిపణులను ఇజ్రాయెల్ రాజధాని టెల్ అవీవ్ సిటీ మీదకు ఎక్కుపెడుతోంది. ఈ క్రమంలో ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు కీలక నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. తన కుమారుడి వివాహ వేడుకను వాయిదా వేసినట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. నెతన్యాహు కుమారుడు అవ్నర్ నెతన్యాహు, అమిత్ యార్దేనీకి త్వరలోనే విహహం జరగనుంది. ఈ మెగా వేడుకను నిర్వహించేందుకు నెతన్యాహు కుటుంబం రెడీ అయ్యింది. అయితే, పశ్చిమాసియాలో చోటు చేసుకున్న యుద్ధ పరిస్థితుల మధ్య నెతన్యాహు తన కుమారుడి పెళ్లి వాయిదా వేసినట్లు తెలుస్తోంది. కాగా, గాజాపై ఇజ్రాయెల్ దాడుల సమయంలో కూడా నెతన్యాహు కుమారుడి పెళ్లి అంశం వివాదాస్పదంగా మారిన సంగతి తెలిసిందే. ప్రజలు ప్రాణాలు కోల్పోతుంటే.. ఆయన ఇంట పెళ్లి వేడుకలు నిర్వహిస్తున్నారంటూ విమర్శలు వ్యక్తమయ్యాయి.

## దొరికిన మాజీ సీఎం విజయ్ రూపానీ భౌతికఖాయం



**గాంధీ నగర్:**

భారత విమానయాన రంగంలో అత్యంత ఘోర విషాదం నింపిన అహ్మదాబాద్ ఎయిరిండియా బోయింగ్ 7878 డ్రీమ్ లైనర్ విమాన ప్రమాద మృతులు వివరాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. తాజాగా ఆదివారం ఒంటిగంట సమయంలో గుజరాత్ బీజేపీ సీనియర్ నేత మాజీ సీఎం విజయ్ రుపానీ భౌతికకాయాన్ని వైద్యులు గుర్తించారు. కుటుంబ సభ్యుల నుంచి సేకరించిన డీఎన్ఏ ఆధారంగా రూపానీ భౌతికకాయాన్ని గుర్తించినట్లు వైద్యులు తెలిపారు. అనంతరం భౌతికకాయాన్ని ఆయన కుటుంబ సభ్యులకు అందించే ఏర్పాట్లు ముమ్మరం చేశారు. రాజ్ కోట్‌లో రూపానీ అంత్యక్రియలు జరగనున్నాయి. జూన్ 12న సర్దార్ వల్లభాయ్ పటేల్ అంతర్జాతీయ విమానాశ్రయం నుండి టేకాఫ్ అయిన AI171 బోయింగ్ 7878 డ్రీమ్‌లైనర్ విమానం టేకాఫ్ అయిన కొద్ది క్షణాల్లోనే కూలిపోయింది. అందులో ఉన్న 242 మందిలో 241 మంది మరణించారు. మృతుల్లో 68 ఏళ్ల రూపానీ ఉన్నారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ ఎయిర్‌పోర్టు నుంచి టేకాఫ్ అయిన కొద్ది సెకన్లలోని కూలిపోయింది. విమానాశ్రయ రన్‌వే నుండి కేవలం ఒక కిలోమీటరు దూరంలో ఉన్న మేఘానీ నగరం ప్రాంతంలోని బీజే మెడికల్ కాలేజీ క్యాంపస్ భవనంపైకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో విమానంలో ప్రయాణికులు సహా, మెడికల్ కాలేజీలో భోజనం చేస్తున్న వైద్య విద్యార్థులు, డాక్టర్లు, క్యాంటిన్‌లో పనిచేస్తున్న సిబ్బంది ప్రాణాలు కోల్పోయారు.



## 67 అంతస్తుల భవనంలో అగ్ని ప్రమాదం..

**దుబాయ్:** అరబ్ దేశం దుబాయ్‌లో ఘోర అగ్ని ప్రమాద ఘటన చోటుచేసుకుంది. 'టైగర్ టవర్'గా పేరొందిన 67 అంతస్తుల 'మెరీనా పినాకిల్' భవనంలో అర్ధరాత్రి పెద్దఎత్తున మంటలు చెలరేగాయి. సహాయక బృందాలు.. 3,820 మంది నివాసితులను సురక్షితంగా బయటకు తరలించాయి. ఇక, ఈ ప్రమాదంలో ప్రాణ నష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. బాధితులకు తాత్కాలిక వసతి ఏర్పాట్లు చేశారు. వివరాల ప్రకారం.. దుబాయ్‌లో 'మెరీనా పినాకిల్' భవనంలో అగ్ని ప్రమాద ఘటన చోటుచేసుకుంది. దాదాపు 6 గంటలపాటు శ్రమించి మంటలను అదుపులోకి తీసుకొచ్చినట్లు స్థానిక మీడియా తెలిపింది. అగ్ని ప్రమాదం నేపథ్యంలో సహాయక బృందాలు 764 ఫ్లాట్ల నుంచి 3,820 మంది నివాసితులను సురక్షితంగా బయటకు తరలించాయి. ఇక, అగ్ని ప్రమాదం కారణంగా ప్రమాదస్థలిలో అంబులెన్సులు, వైద్యసిబ్బందిని మోహరించారు. ఎటువంటి ప్రాణనష్టం లేకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. బాధితులకు తాత్కాలిక వసతి ఏర్పాట్లు చేశారు. మెరీనా పినాకిల్‌లో మంటలు చెలరేగడం ఇదే మొదటిసారి కాదు. 2015లోనూ 47వ అంతస్తులో మంటలు చెలరేగి.. 48వ అంతస్తుకు వ్యాపించాయి. సహాయక సిబ్బంది మంటలార్పారు. దీనికి సంబంధించిన వీడియోలు సోషల్ మీడయాలో వైరల్‌గా మారాయి.

# భారత్‌లో 7400 కోవిడ్ కేసులు

## 24 గంటల్లో 9 మంది మృతి



**న్యూఢిల్లీ:** దేశంలో కరోనా కేసుల సంఖ్య పెరుగుతోంది. యాక్టివ్ కేసుల 7,400కు చేరింది. గత 24 గంటల్లో 269 కేసులు నమోదు కాగా తొమ్మిది మంది మరణించారని కేంద్ర ఆరోగ్య శాఖ శనివారం తెలిపింది. కర్ణాటకలో అత్యధికంగా ఒక్కరోజులోనే 132 కేసులు నమోదయ్యాయి. గుజరాత్‌లో 79, కేరళలో 54, మధ్యప్రదేశ్‌లో 20, సిక్కింలో 11, తమిళనాడులో 12, హర్యానాలో 9తోపాటు ఇతర రాష్ట్రాల్లో కూడా 24 గంటల్లో యాక్టివ్ కోవిడ్ కేసుల్లో పెరుగుదల నమోదైంది. అరుణాచల్ ప్రదేశ్, చండీగఢ్, లద్దాఖ్, మిజోరం, పంజాబ్, పశ్చిమ బెంగాల్‌లో కేసులేవీ నమోదు కాలేదని ఆరోగ్య శాఖ తెలిపింది. గత 24 గంటల్లో మహారాష్ట్రలో నలుగురు, కేరళలో ముగ్గురు, రాజస్థాన్, తమిళనాడులలో ఒక్కొక్కరు మరణించారు. జనవరి 1 నుంచి ఇప్పటివరకు మొత్తం మరణాల సంఖ్య 87కు చేరుకుంది. కోవిడ్‌కు అత్యధికంగా ప్రభావితమైన రాష్ట్రంగా కేరళ ఉంది. ప్రస్తుతం ఈ రాష్ట్రంలో యాక్టివ్ కేసుల సంఖ్య 2,109గా ఉంది. తరువాత స్థానాల్లో గుజరాత్ 1,437, ఢిల్లీ 672, మహారాష్ట్ర 613, కర్ణాటక 527, ఉత్తరప్రదేశ్ 248, తమిళనాడు 232, రాజస్థాన్ 180, ఆంధ్రప్రదేశ్ 102 ఉన్నాయి. మణిపూర్, రాజస్థాన్‌లలోనూ కేసులు పెరిగాయి.



మహా పత్రిక





ANN తెలుగు

# అప్పుడు నంది.. ఇప్పుడు గద్దర్...

## సీనియర్ జర్నలిస్ట్ రెంటాల అరుదైన ఘనత



రచయిత, పరిశోధకుడు, సీనియర్ జర్నలిస్టు, ఉత్తమ సినీ విమర్శకుడిగా నంది అవార్డు గ్రహీత అయిన డాక్టర్ రెంటాల జయదేవ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక 'గద్దర్ ఫిల్మ్ అవార్డు'ను అందుకున్నారు. సినీ రంగాన్ని ప్రోత్సహిస్తూ, ఉత్తమ తెలుగు చిత్రాలకు తెలంగాణ ప్రభుత్వం ఇవ్వడం ప్రారంభించిన గద్దర్ ఫిల్మ్ అవార్డులలో భాగంగా 'తెలుగు సినిమాపై వచ్చిన ఉత్తమ రచనల' కేటగిరీలో జయదేవ రాసిన పుస్తకానికి 2024వ సంవత్సరానికి గాను ఈ గౌరవం లభించింది.

మరుగున పడిపోయిన మన సినీ చరిత్రలోని అనేక అంశాలను తవ్వితీసి, జయదేవ రచించిన 'మన సినిమా... ఫస్ట్ రీల్' పుస్తకాన్ని 'ఉత్తమ సినీ గ్రంథం'గా రాష్ట్ర ప్రభుత్వ జ్యూరీ ఎంపిక చేసింది. శనివారం హైదరాబాద్‌లో వైభవంగా జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట రెడ్డి గద్దర్ అవార్డు సిల్వర్ మెమెంటో, ప్రశంసాపత్రం, నగదు బహుమతిని జయదేవకు అందజేశారు. ఈ సందర్భంగా వేదికపై 'మన సినిమా... ఫస్ట్ రీల్' పుస్తకం ప్రతిని ఉప ముఖ్యమంత్రి అందుకొని, రచయితను అభినందించారు.

ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక ప్రభుత్వం సినిమా అవార్డులు ప్రకటించడం ఇదే తొలిసారి. ఆ తొట్టతొలి అవార్డే రెంటాల జయదేవను వరించడం విశేషం. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నంది అవార్డులుగా పాపులరైన ఈ పురస్కారాల్లో... గతంలో 2011వ సంవత్సరానికి గానూ జయదేవకు 'ఉత్తమ సినీ విమర్శకుడు'గా ఆనాటి రాష్ట్ర ప్రభుత్వ గౌరవం సైతం అందుకున్నారు. తాజా గద్దర్ అవార్డుతో... అటు నంది, ఇటు గద్దర్... రెండూ సాధించి, ఉభయ తెలుగు రాష్ట్రాల్లోనూ ప్రభుత్వ పురస్కార విజేత అయిన తొలి జర్నలిస్టు అనే అరుదైన రికార్డు జయదేవకు దక్కింది.



# నా సూపర్ హీరోని స్మరించుకుంటున్నా : చిరంజీవి

ఫాదర్స్ డే సందర్భంగా మెగాస్టార్ చిరంజీవి సోషల్ మీడియా వేదికగా తన తండ్రికి నీరాజనం అర్పిస్తూ హృదయపూర్వక సందేశాన్ని పంచుకున్నారు. మనం స్థిరంగా ఉండడానికి, జీవితంలో ఉన్నతంగా ఎదగడానికి నాన్న ఎంతో తోడ్పాటు అందిస్తారని చెబుతూ.. 'నా తండ్రిని, నా సూపర్ హీరోని స్మరించుకుంటున్నాను' అని చిరంజీవి ట్వీట్ చేశారు. 'తమ బలం, జ్ఞానం, ప్రేమతో జీవితాలను తీర్చిదిద్దే ప్రపంచంలోని అద్భుతమైన తండ్రులందరికీ ఫాదర్స్ డే శుభాకాంక్షలు' అని కోట్ చేశారు. కాగా, చిరంజీవి నాన్న వెంకట్రావు పోలీస్ కానిస్టేబుల్‌గా పనిచేశారు. ఉద్యోగ రీత్యా ఆయనకు పలు ప్రాంతాలకు బదిలీలు జరిగడంతో చిరంజీవి బాల్యం నిడదవోలు, గురజాల, బాపట్ల, పొన్నూరు, మంగళగిరి, మొగల్తూరు వంటి వివిధ ప్రాంతాల్లో గడిచింది. నాన్న సాధారణ పోలీసు అయినప్పటికీ తమను ఎంతో క్రమశిక్షణగా పెంచారని గతంలో చిరంజీవి గుర్తు చేసుకున్నారు.



# ప్రభాస్ 'రాజాసాబ్' టీజర్ టైం ఫిక్స్.. ప్రీ టీజర్ చూశారా..!

**ప్రభాస్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం ది రాజా సాబ్. మారుతి దర్శకత్వంలో ఈ సినిమా రాబోతుండగా.. పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టీజీ విశ్వప్రసాద్ ఈ సినిమాను నిర్మిస్తున్నాడు. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్రాన్ని డిసెంబర్ 5న ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నారు మేకర్స్. అయితే ఈ సినిమా నుంచి టీజర్ విడుదల చేయబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించిన విషయం తెలిసిందే. జూన్ 16న టీజర్ విడుదల చేయనున్నారు మేకర్స్. తాజాగా దీనికి సంబంధించి మరో అప్‌డేట్‌ను ప్రకటించారు. ఈ సినిమా టీజర్‌ను రేపు ఉదయం 10.52 గంటలకు విడుదల చేయనున్నట్లు చిత్రబృందం తెలిపింది. ఈ సందర్భంగా ప్రీ టీజర్ ప్రోమోను పంచుకుంది.**

# మాళవిక మోహనన్‌కు చేదు అనుభవం



తంగలాన్ బ్యూటీ మాళవిక మోహనన్ ప్రస్తుతం ప్రభాస్ సరసన నటిస్తోంది. మారుతి డైరెక్షన్‌లో వస్తోన్న ది రాజాసాబ్‌లో కనిపించనుంది. మలయాళం, తమిళ చిత్రాలతో ఫేమ్ తెచ్చుకున్న ఈ బ్యూటీ టాలీవుడ్‌లోనూ ఎంట్రీ ఇస్తోంది. ఈ సినిమా ఈ ఏడాది డిసెంబర్ 5న థియేటర్లలో రిలీజ్ కానుంది. ఇప్పటికే మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. అయితే ఇటీవల ఓ ఇంటర్వ్యూకు హాజరైన మాళవిక మోహనన్ తనకెదురైన చేదు అనుభవాన్ని పంచుకుంది. ముంబయి లోకల్ ట్రైన్‌లో ప్రయాణిస్తున్న సమయంలో ఓ వ్యక్తి తనతో అసభ్యంగా ప్రవర్తించాడని తెలిపింది. తన స్నేహితులతో కలిసి రాత్రి సమయంలో లోకల్ ట్రైన్‌లో ప్రయాణిస్తుండగా కంపార్ట్‌మెంట్ వద్ద ఉన్న గ్లాస్ డోర్ నుంచి ఓ వ్యక్తి తమవైపే చూస్తూ ముద్దిస్తావా అని సైగలు చేశాడని తెలిపింది. ఆ సమయంలో తీవ్ర భయాందోళనకు గురైనట్లు మాళవిక పంచుకుంది. ముంబయి లాంటి నగరంలో మహిళల భద్రత లేదని నటి మాళవిక మోహనన్ తెలిపింది. అయితే ఈ వార్త చూసిన ముంబయి పోలీసులు ఆమె జరిగిన ఘటనపై స్పందించారు.

మాళివిక గారు మేము మీ గురించి వార్తల్లో చూశాం.. మీకెదురైన అనుభవాన్ని పంచుకున్నారు. నగరంలో మహిళల భద్రతపై ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి అనుభవాలు ఆశ్చర్యకరంగా దీర్ఘకాలిక ప్రభావాన్ని చూపుతాయి. నగరంలో రోజులో ఏ సమయంలో లేదా ఏ ప్రదేశంలోనైనా.. దయచేసి 112 లేదా 100 నంబర్‌లో మమ్మల్ని సంప్రదించండి. మేము వీలైనంత త్వరగా మీకు అండగా నిలుస్తామని తెలిపారు. ముంబయి పోలీసులు తమ పోస్ట్‌లో రాస్తూ..'ముంబై నగరం ఎల్లప్పుడూ మహిళలకు సురక్షితంగా ఉంటుంది.

భద్రత మరింత మెరుగుపరచడానికి మేము ఎలాంటి చర్యలకైనా సిద్ధం. నేరస్థుడిని తగిన విధంగా.. చట్టబద్ధంగా శిక్షిస్తాం. దయచేసి మీ పేరును ఉపయోగించి ఈ విషయాన్ని వ్యాప్తి చేయండి. ఇలాంటి సమస్యలను పరిష్కరించడంలో బాగా సహాయపడుతుంది.' అని విజ్ఞప్తి చేశారు.



# 47 ఏళ్లు వచ్చినా, ఇంకా సింగిల్..

## ఎలాంటి పార్ట్‌నర్ కావాలో చెప్పిన టాప్ హీరోయిన్

సినిమాల్లో అందం, యూనిక్ యాక్టింగ్ టాలెంట్‌తో మంచి ఫ్యాన్ బేస్ సంపాదించుకున్న ఒక హీరోయిన్.. 47 ఏళ్ల వయసులోనూ సింగిల్‌గా, స్వేచ్ఛగా జీవిస్తోంది. ఆమె లైఫ్‌స్టైల్ చాలా సింపుల్‌గా ఉంటుంది. తన లైఫ్‌కు పాజిటివిటీని యాడ్ చేసే వారితో మాత్రమే ఆమె రిలేషన్ కొనసాగిస్తుంది. ఆ హీరోయిన్ ఎవరో కాదు, దివ్య దత్తా. ఆమె వ్యక్తిగత జీవితం, కెరీర్, ఆలోచనలు ఈ తరం యువతులకు రోల్ మోడల్‌గా మారాయి. ఇప్పుడు కొత్త సినిమా ప్రమోషన్స్‌లో బిజీగా ఉన్న దివ్యను, ఇంకా పెళ్లి ఎందుకు చేసుకోలేదని అడిగితే.. ఆసక్తికరమైన విషయాలు చెప్పింది.

**లైఫ్‌స్టైల్...**

తన జీవితంలో సంతోషం చాలా సింపుల్ ప్రిన్సిపుల్స్‌పై ఆధారపడి ఉంటుందని దివ్య దత్తా చెప్పింది. 'నా జీవితంలోకి పాజిటివ్ ఎనర్జీని తీసుకొచ్చే రిలేషన్‌షిప్పే నాకు ముఖ్యం. స్వేచ్ఛ, సెల్ఫ్‌రెస్పెక్ట్‌కి చాలా ఇంపార్టెన్స్ ఇస్తాను' అని ఓ ఇంటర్వ్యూలో తెలిపింది. పెళ్లి అనేది సరైన పార్ట్‌నర్ దొరికితే అద్భుతమని, లేదంటే జీవితాన్ని సంతోషంగా గడపడానికి చాలా మార్గాలు ఉన్నాయని చెబుతోంది.

**ప్రేమపై ఆలోచనలు...**

దివ్య దత్తా ప్రేమ, వివాహం గురించి ఓపెన్‌గా మాట్లాడింది. 'సరైన పార్ట్‌నర్ దొరికితే మ్యారేజ్ ఒక అందమైన అనుభవం. లేకపోతే ఒంటరిగా ఉండటం కూడా సంతృప్తికరమే. నాపై చాలా మంది మగాళ్ల దృష్టి ఉందని నాకు తెలుసు. కానీ నాతో కలిసి నడవగలిగే పార్ట్‌నర్ కోసం ఎదురు చూస్తున్నాను.' అని చెప్పింది. సంబంధాలైనా, స్వేచ్ఛైనా బ్యాలెన్స్‌డ్‌గా ఉండాలని ఆమె చెబుతోంది. దివ్య దత్త ఇండిపెండెంట్ లైఫ్‌స్టైల్ ఫ్యాన్స్‌ను ఆకట్టుకుంది. సోషల్ మీడియాలో ఆమెను స్ట్రాంగ్, ఇండిపెండెంట్ ఉమెన్‌గా ప్రశంసిస్తున్నారు. '47 ఏళ్ల వయసులోనూ సొంత సిద్ధాంతాలకు కట్టుబడి, సంప్రదాయాలను బ్రేక్ చేస్తూ జీవిస్తోంది' అని ఫ్యాన్స్ చెబుతుంటారు. స్నేహితులు ఆమె అందం, తెలివి, సక్సెస్‌ను చూసి "లవ్ కోసం నీవు ఓవర్‌క్వాలిఫైడ్" అని జోక్ చేస్తారట.

# హీరోయిన్‌గా ఊర్వశి కూతురు తేజలక్ష్మి..

## మొదటి సినిమా ఇదే



నటి ఊర్వశి వారసురాలు హీరోయిన్‌గా రంగప్రవేశం చేశారు. అమ్మ పాత్రలకు, అమాయకపు రోల్స్‌కు, ఎక్స్‌ప్రెషన్స్‌తోనే నవ్వించగల పాత్రలకు పెట్టింది పేరు ఊర్వశి. ఈమె అసలు పేరు కవిత రంజిని. కేరళలో పుట్టి పెరిగిన ఈమె చైల్డ్ ఆర్టిస్ట్‌గా వెండితెరకు పరిచయమైంది. ముందనై ముడిచ్చు అనే తమిళ సినిమాతో హీరోయిన్‌గా మారింది. కొంతకాలంపాటు హీరోయిన్‌గా నటించిన ఆమె ఆ తర్వాత క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా మారింది. తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ, హిందీ భాషల్లో కలుపుకుని 700కు పైగా చిత్రాలు చేసింది. ఊర్వశి ప్రస్తుతం సినిమాలకు కాస్త బ్రేక్ ఇచ్చింది. అయితే, గతంలో ఓ ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ తన కుమార్తె 'తేజ లక్ష్మి' సినీ ఎంట్రీ ఉంటుందని ప్రకటించింది. ఆమె చెప్పినట్లుగానే తాజాగా తన మాతృభాష మలయాళీ ఇండస్ట్రీలో తేజ లక్ష్మి అడుగుపెట్టింది. నటి ఊర్వశి, నటుడు మనోజ్ జయన్‌ను ప్రేమించి 2000లో పెళ్లి చేసుకుంది. వారిద్దరికి జన్మించిన అమ్మాయే తేజ లక్ష్మి. ఆ తర్వాత మనోజ్‌తో విభేదాలు రావడంతో అతడితో విడాకులు తీసుకుని 2013లో శివ ప్రసాద్‌ని పెళ్లి చేసుకుని అతనితో కలిసి జీవిస్తోంది. కానీ తేజలక్ష్మి మాత్రం తన తండ్రితోనే కలిసి ఉంటోంది. మలయాళంలో 'సుందరియాయవల్ స్టెల్లా' అనే చిత్రంలో కథానాయికగా తేజ లక్ష్మి నటిస్తుంది. నటుడు మనోజ్ కే.విజయన్ తన కూతురు కథానాయికగా ఎంట్రీ గురించి ఒక భేటీలో ఇలా మాట్లాడారు. 'తేజలక్ష్మికి సినిమాల్లో నటించాలనే కోరిక ఉన్నట్లు మొదట నా రెండో భార్య నాకు చెప్పింది. దీంతో వెంటనే నా కూతురికి ఒక సలహా ఇచ్చాను. ముందు మీ అమ్మ ఊర్వశికి చెప్పి ఆశీస్సులు తీసుకోమని పంపాను. అలాగే ఊర్వశి కూడా ఆమెను మనస్ఫూర్తిగా ఆశీర్వదించింది. ఊర్వశి సమ్మతించకపోతే తేజలక్ష్మి కథానాయకి అయ్యేదే కాదు. ముందుగా మాతృభాషలో కథానాయకిగా ఎంట్రీ ఇచ్చిన తేజలక్ష్మి తరువాత తమిళం, తెలుగులో కూడా ఎంట్రీ ఇస్తుంది.' అని ఆయన అన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020,
PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com